నవంబర్ 2007

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక



## క్రైస్తవ దాతృత్వం
## ఆశీర్వాదపు తాళపు చెవి

# Trinity Telugu Christian Association USA, Inc.(TTCA)


**WE MEET AT 5.30 PM, EVERY 1st or 2nd SATURDAY OF THE MONTH**

**at**

**Calvary Chapel, 25 Van Zant St, East Norwalk, CT-06855**

**NEXT MEETING 13 OCTOBER 2008**




- Special Video Screening
- Praise & Worship both in Telugu and English
- Testimony & Prayers
- Bible Readings
- Bible One-O-One
- Inspirational message
- Followed by fellowship meal

***About TTCA :*** **Trinity Telugu Christian Association was established by the inspiration of God The Father, Jesus Christ our Savior and Holy Spirit our comforter to reach Telugu Christians across the United States and India to share the Love of Jesus Christ both in Spiritual and Social. As Apostle Paul said in Colossians 3,14 ".... And above all these things put on charity, which is the bond of perfect-ness. CT Bible study started as part of our mission. Please check our web site for more details and our programs. Join us to be part of this grate mission and share the Love of Lord Jesus Christ.**

1976 - 2007 31 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

# స్పందన

ఆధ్యాత్మిక మాస పత్రిక

*THE LARGEST CIRCULATED TELUGU SPIRITUAL MONTHLY SINCE 1976*


**నవంబర్ 2007** **సంపుటి 31** **సంచిక 10**







**వ్యవస్థాపక, ప్రధాన సంపాదకులు**
ఆచార్య ఆరార్కే మూర్తి
ప్రచురణకర్త, సంపాదకులు
డా॥ దేవసహాయం దండల
***గౌరవ సంపాదకులు***
డా॥ జ్ఞాన భాస్కర్
***సంపాదక వర్గం***
బ్రదర్ జి. దేవరాజు
బ్రదర్ కె. పరమానందం
బ్రదర్ ఎన్. దేవానంద్
రెవ. కె.జాన్‌మోజెస్
శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్
బ్రదర్ ఆర్. భూషణం
సహాయ సంపాదకులు
బ్రదర్ డి. ఎఫ్రాయిం
బ్రదర్ దేవిడ్ అబ్రహాం


***ఈ సంచికలో...***


దాతృత్వంలో దేవుని ...
దాతృత్వం
దాతృత్వపు దీవెనలు
రానున్న క్రిస్మసు శుభ...
కృతజ్ఞతార్పణ
అర్పణలో ఆశీర్వాదం
నవజీవన చిత్రాన్ని
క్లుప్త ప్రసంగాలు
బాల స్పందన
ప్రార్ధనా వేదిక

**చందా వివరాలు**

| | స్వదేశంలో | విదేశాలకు |
|---|---|---|
| 1 సంవత్సరం | రూ. 100 | $ 20 |
| జీవిత సభ్యత్వం | రూ. 1000 | $150 |
| పోషక సభ్యత్వం | రూ. 100 (ప్రతినెల) | $ 20 |

**పత్రిక చందాకు మించి పరిచర్య అభివృద్ధి కోసం కానుకలు పంపుచున్న చందాదారులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు, స్పందన పరిచర్య నిమిత్తం మీరు పంపే కానుకలు, చెక్కులు, డ్రాఫ్టులు, ఎం.ఓ.లు, స్పందన SPANDANA పేరు మీద ఈ క్రింది అడ్రస్‌కు పంపాలి.**


స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక
పోస్టు బాక్స్: 415, గార్లపాటివారి వీధి, దుర్గాగ్రహారం, విజయవాడ – 520 002
ఫోన్స్ : 0866 – 2456547, 9346616347 E-mail: read_spandana@yahoo.com



Founder & Chief Founder **ACHARYA RRK MURTHY**
Printed, Published and owned by **DEVASAHAYAM DANDALA**
Printed at BAVANA OFFSET PRINTERS for SPANDANA GRAPHICS
Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada - 2.



# స్పందన - ప్రతి స్పందన

**ఆశీర్వాదం :**

స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక ఎంతో ఆశీర్వాద కరంగా ఉన్నది. తెలియని అనేక విషయాలను స్పందన ద్వారా మేము తెలుసుకుంటున్నాము. అక్టోబర్ నెల స్పందనలో మన కర్తవ్యం వ్యాసంలోని జాగ్రత్త,మాదిరి, ఒట్లు, సహవాసం, ప్రార్థన అంశాలు చాలా బాగున్నాయి. గ.ను.క. బైబిలోని అనేక అధ్యాయాలు చదవటానికి ఉపయోగ పడుతున్నది. ఈ నెల గ.ను.క. పూర్తి చేసి పంపుతున్నాము. ఆరార్కే మూర్తి గారికి, దేవసహాయం గారికి మా వందనాలు.

**-డి. అక్షాణి, ఒంగోలు పోస్టు**

**ఆధ్యాత్మికంగా :**

ప్రభువునందు గౌరవనీయులైన స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక ప్రతినిధులకు యేసయ్య నామములో వందనాలు. మీ పత్రికను ఎంతో ఆశతో చదువుచున్నాము. పత్రికలోని వ్యాసాలు ఆధ్యాత్మికంగా బలపడడానికి ఉపయోగపడుచున్నవి. గ.ను.క. చాలా ఆసక్తిగా ఉంటున్నది. ఈ నెల గ.ను.క. పూర్తిచేసి పంపుతున్నాము. మా కుటుంబము కొరకు ప్రార్థించగలరు.

**-యం. సంపతి, చేగుంట మం॥**

**మేలుకరంగా :**

స్పందన మాసపత్రిక మాలాంటి నూతన సంఘంకాపరులకు చాలా మేలుకరంగా వున్నది. ఆధ్యాత్మికంగా బలపడునట్లు అనేక గొప్ప మర్మములతో కూడిన ప్రసంగములు నాకు ఎంతో మేలుకరంగా ఉన్నవి అందించుచున్న ఎడిటర్‌గారికి వందనములు. గుంటూరు వెళ్ళిన ప్రతిసారి లైబ్రరీలో వున్న స్నేహితుని దగ్గర తీసుకుని చదువుకుంటాను. దయతో నాకు స్పందన పంపగలరు. చందా త్వరలో పంపుతాను.

**- పాస్టర్ పి.జాకబ్, మాచవరం మం॥**

**ఆత్మీయముగా :**

స్పందన పరిచర్య అంతటిని బట్టి మీకెల్లరుకు వందనాలు. పత్రికలో మీరు ప్రచురించు దైవ వర్తమానములు బట్టి ఆత్మీయముగా ఆనందించుచు కృతజ్ఞతలు తెలుపుచున్నాను. స్పందన చందా స్వీకరించగలరు.

**-బి. దాస్. కావలి**

స్పందన ఆధ్యాత్మిక పత్రికలోని దైవసందేశములు చాలా ఆత్మీయముగా ఉంటున్నాయి. అవి చదువుట ద్వారా చాలా జ్ఞానము పొందుచున్నాము మా కుటుంబము కొరకు ప్రార్థించగలరు.


**-బి. దేవదానము, ఖమ్మం**

స్పందన ఎంతో బాగుంటుంది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నందుకు అభివందనలు. మా కొరకు ప్రార్థించండి.

**-దియ్యా ప్రసాదరావు, ఫిరంగిపురం**

సంపాదకీయం

# ఇస్తూవుండాలి!



దేవుడు మనకిచ్చింది ఎంతోవుంది. దేవుడిది పెద్ద చెయ్యి. మనిషిది చిన్నచెయ్యి. దేవుడు ఒక దోసెడిస్తే, నీవు ఒక దోసెడు అందులోంచి యిస్తే, అటు దేవునికి మహిమ, మనిషికి ఆశీర్వాదం. ఇవ్వటం ఘనత. క్రైస్తవ్యం అంటే క్రైస్తవ పద్ధతిలో యివ్వటం మాత్రమే గాదు పుచ్చుకోవటం కూడా, ఇచ్చేటప్పడు దాన్ని పుచ్చుకునేవాడు క్రైస్తవ పద్ధతిలో స్వీకరించటం నేర్చుకోవాలి. ప్రాచీన కవి పలికినట్లు "ఇచ్చే నా చేయి పైన వుంది. ఇదెంత ఘనత! దేవుడు యివ్వకుండా మనల్ను యివ్వమనడు. విత్తని చోట దేవుడు పంటను ఆశించడు.

ఇవ్వటమంటే విత్తనం వెయ్యటం. క్రైస్తవుడి ప్రతి చర్యా నిత్యత్వంలో ఫలిస్తుంది! మనం ఏది విత్తితే అదే పంట అదే నిష్పత్తిలో కోస్తాము. అంతేకాదు, రాను రాను పంట అపరిమితంగా ప్రసారమవుతుంది. అయిదు విత్తనాలు వంద అయితే, వంద విత్తనాలు పదివేలవుతాయి. ఈ విధంగా పంట విస్తరిస్తుంది. దీన్ని "జమెట్రికల్ ప్రోగ్రెషన్" అంటారు.

క్రైస్తవ విశ్వాసులారా! ఎంతిస్తున్నారు? ఏమిస్తున్నారు? మీ జీవితంలో, జీతంలో ఎంత భాగమిస్తున్నారు? దీనికి మీ జవాబే మీ క్రైస్తవ సౌశీల్యానికి గీటురాయి. తెలిసిందా? దైవాశీస్సులు!

క్రీస్తునందు

**మీ ఆరాన్కే**



# మనలో మాట



క్రీస్తునందుప్రియ పాఠకులకు,

నవంబరు నెల శుభాకాంక్షలు మీకు 1 కొరింథీ 9.7 తో తెలియజేస్తున్నాను. ఈ సంచికలో దాతృత్వము అనే అంశం మీద అనేక వ్యాసాలు ప్రచురిస్తున్నాము. ఈ నెలలో అనేక సంఘాలలో కోతకాలపు పండుగలని జరుపుకుంటారు. నేనామధ్యన ఓ దైవజనునితో మాట్లాడుతూఉంటే ఆయనన్నారు, ప్రతివారం మాకు కోతకాలపు పండుగే! అని. అవును నూతన నిబంధన ప్రకారం వర్ధిల్లిన కొలది ప్రభువు పని కోసం ఇవ్వాలి. నా జీవితంలో నేనెరుగుదును దేవుడు నాతో మాట్లాడినప్పుడు అది ఎంత మొత్తమైనా దేవుని సేవకు ఇవ్వటం నేర్చుకున్నాను. ఆ మధ్యన, మా కోసం ఎంతో భారంతో ప్రార్ధించే ఒక దైవజనుడు మా ఇంటిని దర్శించారు. కొంత సమయం ప్రార్ధనలో గడిపాక ఆయన వెడుతూ ఉండగా ఆయనకు కానుక ఇద్దామని చూస్తే ఇంట్లో డబ్బులు లేవు. కేవలం ఓ ఐదువేల రూపాయలు మాత్రమే ఉన్నాయి. ఆ డబ్బు ఆ దైవజనునికివ్వమని ప్రభువు నాతో చెప్పారు. కానీ, మనసొప్పలేదు, కారణం ఆ డబ్బు తప్ప మా దగ్గర వేరే డబ్బు లేదు. ఏంచేద్దాం? అని నా భార్యనడిగితే "సణుగుకొనక, బలవంతంగా కాక సంతోషంగా ఇవ్వాలని దేవుని వాక్యం చెబుతోంది, కదండి" అన్నది. సరే, సంతోషంగా కానుకను దైవజనుని సేవకోసం ఇచ్చాము. అద్భుతమేమంటే అంతకు మునుపు చాలా కాలం నుండి ఓ కుటుంబం తమను దర్శించి ప్రార్ధించమని నన్ను కోరుతూ వచ్చారు. ఆ వారంలో ఆ ఇంటికి వెళ్లి ప్రార్ధించి వస్తూవుంటే ఆ సోదరుడు కానుక పెట్టిన కవరు ఒకటి ఇచ్చారు. ఆ సోదరి, అన్నయ్యా ప్రభువు నాతో మాట్లాడారు నా గాజులు (బంగారపువి) దేవుని సేవకు ఇవ్వాలని ఇవి తీసుకెళ్లి దేవుని సేవలో వినియోగించండి. అలా, కానుక, బంగారం రెండూ ఒకేసారి కానుకగా రావటం నా సేవజీవితంలో మొదటిసారి. వెంటనే ఆ డబ్బుతో రెండు గ్రామాలలో మందిరాలు నిర్మించటానికి పూనుకున్నాము.

గమనించారా, దేవుని మాట ప్రకారం మనం దేవుని సేవకు ఇస్తే దేవుడు తప్పక మన అవసరతలు తీరుస్తాడు. సాధారణ జీవితంలో మనకు బాగా తెలుసు, మనం

పొలంలో విత్తితే పంటను కోస్తాము. ఇదే సూత్రం ఆధ్యాత్మిక జీవితంలో కూడా తప్పక వర్తిస్తుంది. దేవుని సేవలో నీవు ధారాళంగా విత్తితే దేవుని వద్దనుండి నీవు ధారాళంగా పొందుకుంటావు. చాలా మంది దేవునికివ్వటానికి చాలా పిసినిగొట్టులుగా ఉంటారు, మీరు వారి జీవితాలను జాగ్రత్తగా కనిపెట్టండి. దేవునికివ్వకుండా వారి దాచిన డబ్బుకు, ఎన్నోరెట్లు ఎక్కువ ఏ ఆస్పత్రి బిల్లుకో, లేక ఏదో నష్టం రావటం మూలకంగానో పోగొట్టుకుంటారు. దేవునికిచ్చే గుణం నీకుంటే దేవుని వాక్యవాగ్ధానాల ప్రకారం సమృద్ధి ఆశీర్వాదాలు నీ వెంటే వుంటాయి.

మా ప్రియపాఠకులకు ప్రేమతో సవాలుగా చెబుతున్నాను. ఈ మంచి ఆధ్యాత్మిక లక్షణాన్ని మీ జీవితాల్లో కలిగి ఉండండి. 'నీవు దేవుని పనికి సంతోషంగా ఇచ్చే వ్యక్తివేనా? లేదా సణుక్కుంటూ ఇస్తావా, లేదా పిసినారివా?. సంతోషంగా ఇచ్చేవారిని దేవుడు దీవిస్తాడు. ఎందుకు? ఎందుకంటే సంతోషంగా నీవు ఇస్తున్నావంటే నీది దాతృత్వ హృదయం. అదేమి తెలియజేస్తున్నది – ఏదో ఇవ్వాలి కాబట్టి బలవంతంగా, పళ్లబిగింకంతో గాక, నీవు దేవుణ్ని ప్రేమిస్తున్నావు కనుక ఇస్తావు. అలాంటి దాతృత్వం ఫలితాన్నిస్తుంది.

దేవుడు సంబంధాల ద్వారా పనిచేస్తాడు. ఇతరుల ద్వారా దేవుడు నిన్ను దీవిస్తాడు. దేవుడు ఇతరులను ఎవరినో ప్రేరేపించటం ద్వారా నీవు దయపొందేట్లు నీ అవసరాలు తీర్చబడేట్లు చేస్తాడు. కాబట్టి నీవు దేనిని కలిగియున్నా – డబ్బు, తలాంతులు, విషయాలు లేదా ఇతరులను ప్రోత్సహించే మాటలు మొదలయిన మంచి విషయాలన్నీ ఇతరులు కూడా దీవించబడేలా, ఆశీర్వదించబడేలా పంచుకోవాలి.

ఆదికాం 8.22 "భూమి నిలిచియున్నంత వరకు **వెదకాలమును, కోతకాలమును**, శీతోష్ణములును, వేసవిశీతకాలములును, రాత్రింబగళ్లును ఉండక మానవు......" గమనించండి. **విత్తనము వేసే వెదకాలము, పంటను కోసే కోతకాల** సూత్రము దేవుని రాజ్యానికి కూడా వర్తిస్తుంది. అంచేత దేవుడు నీకిచ్చిన దానిని స్వార్ధంతో దాచుకోవటానికి బదులు దేవుని విధానంలోకి వస్తే, దేవుని వద్దనుండి నీవు స్వీకరిస్తూ, ఇతరులకు మరలా ఇచ్చివేసే స్థితిలో ఉంటావు. ఇచ్చే సామాన్యమైన లక్షణం వలన మీ ఆశీర్వాదాలను రెట్టింపు చేసుకోవచ్చని మీకు తెలుసా? నీకు రావాల్సిన దానికంటే ఎంతో ఎక్కువ నీవు అందుకుంటావు. బైబిలు ఈ విధంగా సెలవిస్తోంది. "వెదజల్లి అభివృద్ధి పొందువారు కలరు. తగినదానికన్నా తక్కువ ఇచ్చి లేమికి వచ్చువారు కలరు". సామెతలు 11.24. . నీవు ఇచ్చినపుడు ఇతరుల జీవితాల్లోనికి ప్రేమను వెదజల్లుతున్నావు. నీవు అలా చేసినపుడు దేవుడు నీకు సమృద్ధినివ్వటానికి ఆయన మాట ప్రకారం కట్టుబడి ఉంటాడు. దైవాశీస్సులు.

క్రీస్తునందు మీ సోదరుడు

**దేవసహాయం దండల**



*ఈ మాసపు ప్రసంగం*

*- ఆచార్య ఆరార్కే మూర్తి*

# దాతృత్వంలో దేవుని చిత్తం

మనం దేవుని చిత్తం ఏమిటో తెలుసుకోవచ్చు. తెలుసుకోగలం. తండ్రి తన బిడ్డలకు తన చిత్తం తెలియజేయడా? దేవుని చిత్తమెరుగని వారు జీవితంలో గుడ్డివారవు తారు. జీవితంలో నూతనత్వం సిద్ధించదు. పారంపర్యాచారాలకు బానిసలై యాంత్రిక క్రైస్తవ జీవితంలో మగ్గిపోతూ వుంటారు. మన నైతిక జీవితంలో ఆధ్యాత్మిక ప్రవర్తనలో దేవుని చిత్తమేదో తెలియకపోతే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేము. నైతికంగా ఏది చెయ్యాలో ఏది చెయ్య కూడదో దేవుని చిత్తమేమిటో గ్రహించాలి. ఆయన సంపూర్ణ చిత్తానికి ఫలితం నీలో సంపూర్ణశాంతి. ఆయన చిత్తానికి వ్యాఘాతం ఏర్పడినప్పుడు ఆందోళన - మనసాక్షిలో అవ్యక్తమైన రభస ఏర్పడతాయి. నీ జీవిత లోకపు అలలకు కొట్టుకొని పోకుండా వుండాలంటే దేవుని చిత్తమెరిగి వుండాలి. నీ జీవితగతిని, గమ్యాన్ని నిర్ధారణ చేయాల్సింది లోకంకాదు. దేవుని వాక్యం. అదే దేవుని చిత్తం. దేవుని చిత్తమవునో కాదో పరీక్షించి తెలుసుకోవాలి.

**విధేయత**

లోక మర్యాదవుంది. అంటే యిది లోకపు నటన. ప్యాషన్. లోకం నీ మీద వత్తిడి చేస్తుంది. నిన్ను తన పద్ధతికి మార్చాలని చూస్తుంది. లోక మర్యాద అంటే నిన్ను ఆకర్షించే "స్కీము" అని గ్రహించాలి. యాకోబు 4:7 లోని సూత్రం సర్వదా ఆచరణీయం. దేవునికి లోబడివుండాలి. అదే సయమంలో సైతానును ఎదిరించాలి, నిర్జించాలి, దిక్కరించాలి, నిరోధించాలి. లోకధర్మం మనకు ఆధర్మం. లోక నీతి మనకు అవినీతి. దుర్నీతి. లోకంలో ఒకటైపోతే, నీకు దేవుని చిత్తమంటే ఏమిటో తెలియదు.

**క్రమశిక్షణ**

యేసుక్రీస్తు శిష్యుడు క్రమశిక్షణను అలవరచుకోవాలి. ఆధ్యాత్మిక జీవితం రానురాను బలం పుంజుకోవాలి. దేవుని దృక్పథం, క్రీస్తుమనస్సు అభ్యాసం చేయాలి. దేవుని వాక్యాన్ని క్రమబద్ధంగా అధ్యయనం చేయాలి. రాయబడిన దేవుని వాక్యానికి అణుగుణమైనదే దేవుని చిత్తం, పరిశుద్ధాత్మ నడుపుదల లేని వారికి వెలుగుండదు. పరిశుద్ధాత్మ క్రమశిక్షణాత్మ. మన దేశ సంస్కృతికి చెందిన వాటిలో కొన్ని వాక్యానికి విరుద్ధమైనవి

వున్నాయి. అవి యిదమిద్ధమని బైబిలులో రాసి వుండవు గాని దేవుని ఆత్మ మనకు చెబుతాడు.

**పరిస్థితులు**


దేవుడు అడపా దడపా పరిస్థితుల గుండా మాట్లాడుతాడు. తన చిత్తం మనకు బయలుపరుస్తాడు. ఈసందర్భంలో గూడా పరిశుద్ధాత్మ ప్రక్రియ ఎంతో వుంది. దైవదాసుల ప్రవచనాల ద్వారా దేవుడు నీ పట్ల తన చిత్తమేదో చూపవచ్చు. ఆయా సందర్భాలలో దేవుడు నీకేదైనా సూచన చూపవచ్చు. మనం దేవుని చిత్తమెరిగి ఆ ప్రకారం ప్రవర్తించినప్పుడే క్రమేణా నీలో రూపాంతరానుభూతి కలుగుతుంది.

**సంఘం**

దేవుని సంఘం అంటే యేసుప్రభువు శరీరమే! ఆయన మార్మిక శరీరమే సంఘమని వ్యవహరించబడుతుంది. ఈ సంఘశరీరంలో ప్రతి అవయవమూ ఎంతో ముఖ్యమైనది. అవసరమైందీ ఏదీ లేదు. సంఘంలో ప్రతి సభ్యునికి ఏదో తలాంతు, మీనా, వరం వుంటుంది. ప్రతి ఒక్కరికీ పిలుపు వుంటుంది. ప్రతి అవయవమూ మొత్తం శరీరక్షేమాభివృద్ధికి కృషి చెయ్యాలి. అంతేకాదు, లోకంలో వున్న యితరులకు సేవ చెయ్యాలి. సాయం చెయ్యాలి. ప్రేమ పరిచర్య సంఘ శరీరంలో ప్రతి అవయవం పనిచేయకపోతే చచ్చుబడిపోతుంది. సంఘం లో సక్రమంగా విధి నిర్వహణ జరగాలి. అపోస్తలులు, ప్రవక్తలు, సువార్తికులు, కాపరులు, ఉపదేశకులు అందరూ చేసే సేవ శరీరాన్ని పెంచుతుంది. వీరందరి పరిచర్యకూ దేవుని వాక్యమే ఆధారం!నీ ఆస్తిపాస్తులు, డబ్బు, దస్కమూ అంతా నీవి కావు. దేవుడే నీ యజమాని, నాయకుడు. నీ అక్కరలు తీర్చేవాడు ప్రభువే గదా! నీ డబ్బుకూ, వస్తు వాహనాలకు ప్రభువే అధికారి. నీవాయన గృహ నిర్వాహకుడవు. నీ ధనాన్ని, కాలాన్ని నీవెలా వాడుతున్నావో దాన్ని బట్టి నీ విలువలు తెలిసిపోతాయి. ప్రభువుకు ప్రాధాన్య మిస్తున్నావా? లేదా? ఆధ్యాత్మిక విలువ లెరుగుదువా? ఆ ప్రకారం డబ్బును వాడాలి. తెలిసిందా?కుటుంబంలో కలహాలు, అసంతృప్తి, వొత్తిడులు, దరిద్రం వీటన్నింటికీ మూల కారణం బాకీలు, అప్పులు, రుణాలు, నీ మానసిక ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి. గురితప్పిన బతుకులు, దారం తెగిన గాలిపటాలు, అప్పుట్లో తల మునకలైన బతుకులు. వాస్తవిక దృక్పధంలో మన అక్కరలకు, కోరికలకు మధ్యవున్న దూరం తగ్గించుకుంటూ పోవాలి. ధనాన్ని పొదుపుగా వాడాలి గాని పిసినారితనం మంచిదికాదు. దుబార పనికిరాదు.

**డబ్బు విలువ**

డబ్బు విలువలేనిదా అంటే విలువగలదే. సద్వినియోగమైన ధనం మంచిది. దుర్వినియోగమైన డబ్బు చెడ్డది. అలాగే న్యాయంగా సంపాదించిన డబ్బు మంచిది. అన్యాక్రాంతంగా సంపాదించింది చెడ్డది. దశమ భాగాలు తప్పనిసరిగా యివ్వాలి. దాని ద్వారా ఆర్థిక క్రమ శిక్షణ ఏర్పడుతుంది. దైవసేవలో నీకూ భాగముంటుంది. ఆధ్యాత్మిక దరిద్రం ఘోరం. అది రాకుండా వుండాలంటే మన దాతృత్వం వర్ధిల్లాలి. దశమభాగం చెల్లించే విధానం ఆదాముతోనే మొదలైంది. ధారాళంగా యిచ్చే వారికి ఆధ్యాత్మిక, భౌతిక ఆశీర్వాదాలు కలుగుతాయి. దేవుని కాపుదలలోనిత్య బహుమానాలెన్నో దొరుకుతాయి. దైవాశీస్సులు.



ధ్యానం

# దాతృత్వం

**డా॥ దేవసహాయం దండల**

***నేటి వరకు క్రైస్తవ ప్రజలకు దేవుడిచ్చిన ఆజ్ఞ దాతృత్వం. ఇవ్వండి, ఇస్తే మీ కివ్వబడుతుంది. అని ప్రభువు స్వయంగా చెప్పాడు. లూకా 6:38 ఎవరికివ్వాలి అంటే అక్కరగలవారికి. ఎలాగివ్వాలి అంటే దేవుని పేరట. కొలస్సీ 3:17. దాతృత్వం దేవునికి కృతజ్ఞతా సూచకం. దాతృత్వం క్రైస్తవారాధనలో ఒక భాగమని మన మెప్పుడూ మరువరాని సత్యం.***

***ఉచితం !***

దేవుని కృప ఉచితం. విశ్వాసులు దేవుని వద్దనుండి స్వీకరించిందంతా వుచితమే! ఉచితంగా పొందారు గనుక వుచితంగా యివ్వాలి. మత్తయి 10:9. దేవుడిచ్చింది మనం కూడబెట్టు కోవటానికి కాదు. తిరిగి యివ్వటానికి. విత్తనం నాటేది పంటకోసం. క్రైస్తవ దాతృత్వ మంతా “బీజ విశ్వాసం” విత్తనం వేసే ప్రక్రియ. కొంచెంగా విత్తితే కొంచెం పంట. సమృద్ధిని విత్తితే సమృద్ధిపంట. 2 కొరింథి 9:6.

***వేషధారణ***

దాతృత్వంలో వేషధారణ గొప్ప శోధన. నలుగురికి కనబడాలని కీర్తికండూతితో యివ్వటం ఫక్తు వేషధారణే. ఎంత యిచ్చావు అనేది కాదు ప్రశ్న. యివ్వగా నీకెంత మిగిలింది అనేది ముఖ్యం. ఇవ్వటానికి కృతజ్ఞత సరైన ప్రేరకం. నీకు దేవుడు అనుగ్రహించిన అభివృద్ధికి అనుగుణంగా నీ దాతృత్వం విస్తరించాలి. 1 కొరింథి 16:2 చూడండి ఇష్టపూర్వకంగా, స్వచ్ఛందంగా యివ్వాలి. బలవంతం మీద యిచ్చింది దాతృత్వ కృప అనిపించుకోదు. ఉత్సాహంగా యివ్వాలి. సణుక్కోకూడదు. దేవుడు ప్రేమించే వారి దాతృత్వం స్వచ్ఛందమైనది.

### *ఫలితం!*

దాతృత్వానికి దేవుడు గొప్ప ఫలితం వాగ్దానం చేశాడు. మత్తయి 10:42 ఇవ్వటమనే కృప సర్వతోముఖమైన అభివృద్ధికి కారణమవుతుంది. వెదజల్లి దరిద్రులకిచ్చిన ప్రభువు నీతి శాశ్వతమైనది. అది మనకు సంక్రమించింది. పూర్ణౌదార్య భాగ్యం నీతి ఫలాలలో రాణిస్తుంది. వీరు శక్తికి మించి యివ్వగలరు. మాసిదోనియా విశ్వాసులు ఈ విధంగా యిచ్చారు. 2 కొరింథి.8:5. సువార్త విశ్వాసులను ప్రేరేపించి, ఆత్మార్పణకు నడిపిస్తుంది. లూకా 21:3లో బీద విధవరాలు దాతృత్వంలో మనకు ఒక క్రొత్త వరవడి తెచ్చిపెట్టింది. ఆమె తనకున్నదంతా యిచ్చివేసింది. ఇతరులు తమకున్న దానిలోంచి బహుచిన్న మొత్తం తెచ్చి యిచ్చారు. త్యాగశీలం ఆమెలో పరాకాష్ట రేఖను అంటుకున్నది. అవసరమైతే ఆమె తన ప్రాణం సైతం అర్పించటానికి సిద్ధం లూకా 14:33 ఏం చెబుతోంది! తనకు కలిగిందంతా విడిచిపెట్టనివారు యేసు శిష్యులు కానేరరు. యేసుకోసం సర్వం త్యాగం చేసినవారు నిత్యజీవం స్వతంత్రించుకుంటారు.

### మాదిరి దాతృత్వం

యేసును చూట్టానికి వచ్చిన జనులు తెచ్చిన కానుకలు ఎంతో విలువైనవి. బంగారం, సాంబ్రాణి, బోళం, అనే వస్తువులు ఖరీదైనవి. మంచి సమరైయుడు దారి ప్రక్కన పడివున్న అభాగ్యుని కోసం ధారాళంగా ఖర్చు చేసాడు. అందుకే దాతృత్వం గొప్ప కళ అన్నాడు పౌలు. షేబ రాణి వ్యయ ప్రయాసలకోర్చి సొలొమోను సందర్శనార్థమై వచ్చి, గొప్ప కానుకలు సమర్పించింది. అందరినీ మించి యేసుక్రీస్తు దాతృత్వానికి దేవుని మాదిరి. యేసు బీదవాడ య్యాడు. ఆయన బీదరికం చేత మనం ధనవంతులమయ్యాము.

### *యేసు ఎలాంటివాడు?*

ఆయన పుట్టిన కుటుంబం బీదరికంలో ఎంతో అణగారిపోయి వుంది. పశువుల తొట్టిలో పరుండిన శైశవం నుండి సిలువమీద మరణించే వరకు యేసు ఎంతో దరిద్రం అనుభవించాడు. ఆయన చనిపోతే, పాతిపెట్ట టానికి సమాధికూడా ఎరువు తెచ్చుకోవలసి వచ్చింది. అయితే యేసు కేవలం మానవుడు కాదు. నిత్యుడు, దేవుడు. మీకా 5:2. ఆయనే సృష్టికర్త. కలిగివున్న దేదియూ ఆయన లేకుండా కలుగలేదు. అదృశ్య దేవుని దృశ్యమాన స్వరూపం.

దరిద్రుడై మానవుడికి ప్రత్యామ్నాయంగా సిలువమీద చనిపోయాడు. ఇప్పుడు తన యందు విశ్వాస ముంచినవారికి దేవుని వారస త్వాన్ని పంచిపెడుతున్నాడు. ఆహా! క్రీస్తు దాతృత్వమెంత మహత్తరమైనదో చూడండి. చెప్పనశక్యం గాని దేవుని వరాన్ని బట్టి ఆయనకు స్తోత్రం!

**పిసినారితనం**

తప్పిపోయి తిరిగి వచ్చిన కుమారుడు చచ్చిపోయి బతికాడు. దీనికి అతడి అన్న సంతోషించడు సరిగదా యింత డబ్బు ఖర్చెందు కు అని తండ్రిమీద అలిగాడు. ఇలాంటి పిసినారి పీచులు దేవుడిని మహిమపరచరు. సంతోషంగా సేవ చెయ్యలేరు.


నయమాను తెచ్చిన కానుకల్ని ఎలీషా తిరస్కరించాడు. గాని గెహజీ లగేజీ అతడి శాపానికి కారణమైంది.

ఆహాబుకు ధనవ్యామోహమెక్కువ. నీ డబ్బును నీవెలా వినియోగిస్తావో దాన్ని బట్టి నీ సౌశీల్యం బట్టబయలవుతుంది. డబ్బు సంపాదనకంటే దేవునికి విధేయులవటం ముఖ్యమని మన దేశంలో సగటు క్రైస్తవుడు గ్రహిస్తేనే గాని సంఘ ఉజ్జీవం ప్రవర్తిదు. గృహనిర్వాహకత్వం యజమానికోసం ఖర్చుచేసి లెక్కచూపుతుంది. దుబారాగా స్వార్ధం కోసం అహంను పోషించు కోవటానికి ఖర్చుచేసినారు రేపు ప్రభువు సమక్షంలో ముద్దాయిలు. సామెతలు 6:1–5, చదవండి.

***చాలెంజి!***

సోదరీ, సోదరులారా! ఇవ్వండి, ఆత్మల రక్షణకై యివ్వండి. 1కొరింథి 16:15 వచనాలలో ఏముందో కొంచెం పరిశీలించాలి. స్తెఫను యింటివారు అకయ యొక్క ప్రధమ ఫలం. వారు పరిశుద్ధులకు పరిచర్యచేయటానికి తమను తాము అప్పగించుకున్నారు. తమను తాము అప్పగించుకోవటం అంటే అలవాటు పడిపోయారు. అది వారి జీవిత విధానం. లైఫ్‌స్టయిల్. టాసో అనే గ్రీకు పదాన్ని ఈ సందర్భంలో గుర్తించాలి. అధికారం క్రింద వుండటం. కంట్రోలు. లూకా 7:8లో ఇదే పదం వాడబడింది. అలాగే స్తెఫను యింటివారు పరిచర్యకు లోబడ్డారు. 1 కొరింథి 16:13లో చెప్పినట్లు మెళుకువగా వుండాలి. విశ్వాసంలో నిలకడగా వుండాలి. పౌరుషం కలిగి వుండాలి. బలవంతులై వుండాలి. చేసేదంతా ప్రేమతో చెయ్యాలి. స్తెఫను యింటివారు యిలాంటి సేవకు అప్పగించుకుని అలవాటైపొయ్యారు.

ద్వితి.కాం 32:46–47 చూడండి. ఇందులో మోషే ఏమంటున్నాడో వినండి. “మీతో సాక్ష్యంగా నేడు నేను పలికిన మాటలన్నీ మీ మనస్సులో పెట్టుకోండి. మీ సంతతివారు ఈ ధర్మశాస్త్ర వాక్యాలన్నింటినీ అనుసరించి నడుచుకోవాలని వారికి ఆజ్ఞాపించాలి. ఇది మీకు నిరర్ధకమైన మాటకాదు. ఇది మీకు జీవమే! 1 కొరింథి 15:58 మీరెప్పుడూ మరువకండి. దేవునికి స్తోత్రం!!



# దాతృత్వపు దీవెనలు

**–ప్రవాసి**

దాతృత్వం క్రైస్తవ కృప. ఎందుకివ్వాలో, ఎంత యివ్వాలో దేవుని వాక్యమే మనకు నేర్పుతుంది. దేవుని ఆత్మ బయలుపర్చిన సత్యాలే దాతృత్వానికి విశ్వాసుల్ను ప్రేరేపిస్తాయి. ఇవ్వటం విషయంలో ప్రతి క్రైస్తవుడూ దేవుని సంకల్పాన్ని గ్రహించి ముందంజ వేయాలి.

మన ప్రభువు మనం జన్మించక ముందే మనల్ను ప్రేమించాడు. మనకు పాపక్షమాపణ సిద్ధపర్చి, ఆయన ఉండే చోటున మనమును ఉండేలాగున మన కొరకు నివాసస్థలాలు సిద్ధపరుస్తున్నాడు. అయితే ఈ లోకంలో దేవుని పనిని ఆయన రక్తములో కడుగబడి విమోచించబడిన మనకు అప్పగించాడు. ఈ పనిని మనం త్వరితంగా, యధార్థంగా చేయాలి.

నేటి సమాజంలో ప్రతి దానికి డబ్బు ఎంతో అవసరమైవుంది. అయితే ఒక క్రైస్తవుడు డబ్బే సర్వస్వంగా భావించడు. డబ్బు తనపై పెత్తనం చేయడానికి అంగీకరించడు. గాని డబ్బును లొంగదీసి, ఒక పనివానిగా వాడుకుంటాడు. క్రీస్తును నమ్మిన ప్రతి వ్యక్తి తన చేతికి వచ్చే డబ్బు దేవుని వలన పొందుతున్నానని గ్రహిస్తాడు. ఆ డబ్బును సరైన రీతిగా ఉపయోగిస్తాడు. తన రాబడి విషయంలో, ఖర్చు విషయంలో ప్రార్థించి, దేవుని చిత్తానుసారంగా ఓ ప్రణాళికను ఏర్పరచుకుంటాడు. రానైయున్న ఏడు సంవత్స రములలోనే సిద్ధపడుమని ప్రభువు యోసేపు కాలములో హెచ్చరించబడ్డాడు. అందుకే మన రాబడిపై ఓ ప్రణాళిక కలిగి వుండాలి.

*ప్రణాళిక*

మనకున్న ధనాన్ని సరైన వాటికోసం వెదజల్లి అభివృద్ధి పొందాలి. లోభత్వానికి చోటిచ్చి ఉన్నదికూడా పోగొట్టుకోకూడదు. వెదజల్లి అభివృద్ధి

పొందువారు కలరు. తగిన దానికన్న తక్కువ యిచ్చి లేమికి వచ్చువారు కలరు" సామెతలు 11:24. దాతృత్వ నియమాలు పాత క్రొత్త నిబంధన కాలాలలో ఒకటే! దేవుని ప్రజలు దాతృత్వకృపలో ఆరితేరిన వారు. క్రైస్తవులు పన్నులు ఎగగొట్టరు. దేవునికి యింత యివ్వాలి అని నియమం లేదు. ఎంతైనా యివ్వవచ్చు. అయితే పాత నిబంధన ఆర్థిక వ్యవస్థలో దేవాలయపు పన్ను, అధికాదాయం పన్ను, ఏడేండ్ల కొకసారి భూమిని దున్నకుండా వదిలెయ్యడం వగైరాలు అమలులో వుండేవి. కొత్త నిబంధన కాలానికి రోమా ప్రభుత్వం వచ్చి, ప్రజల్ను పన్నులతో వేధించుకు తిన్నది. అయితే యూదులింకా ధర్మశాస్త్రోక్త విధానాన్ని అనుసరించి పన్నులు చెల్లిస్తూనే వున్నారు.

**పన్నులు**

యేసు ప్రభువుకూడా పన్నులు చెల్లించాడు. ఆయన రారాజు. అయితే ఆయన కూడా యిహలోక ప్రభుత్వానికి పన్నులు చెల్లించాడు. మనం దేవుని కుటుంబికులం. అయినా పన్న చెల్లించి తీరాలి. కైసరువి కైసరుకి, దేవునివి దేవునికి చెల్లించాలి గదా? దశమ భాగాలు కూడా పన్ను కిందకే వస్తాయి. యిశ్రాయేలు ఆర్థిక వ్యవస్థలో పదో వంతు పన్నుగా చెల్లించారు.

**అబ్రహాము**

అబ్రహాము దశమభాగాలు మెల్కిసెదెకుకు చెల్లించాడు. స్వచ్ఛందంగా యిచ్చాడు. దశమభాగాలు కొత్తనిబంధనలో దాతృత్వమని ఎక్కడా చెప్పబడి వుండలేదు. లూకా 6:38 ప్రకారం ఇచ్చేవారికి యివ్వబడుతుంది. అంటే యివ్వడమంటే ఆధ్యాత్మికమైన పెట్టుబడి. నీ డబ్బును ఎక్కడ పెడతావో, అక్కడే నీ హృదయం వుంటుంది. దేవుడికిస్తే నీ హృదయం దేవుడిలో కేంద్రీకృత మవుతుంది. నీ ధనమంతా దేవునిలో పెట్టుబడి పెట్టు. అది క్షేమం. భద్రత, సంతోషంగా యిచ్చేవారిని దేవుడెంతో ప్రేమిస్తాడు. కొంచెంలో నమ్మకంగా వున్నవాడు గొప్పలో కూడా నమ్మకంగా వుంటాడు. దేనికి తగిన నిష్పత్తి దానికి వుండి తీరాలి. నీ కున్న దాంట్లో నుంచి త్యాగం చేసుకుని యివ్వటమంటే, అర్థం చేసుకోలేని అభాగ్యులెందరో వున్నారు. కొంచెంలో త్యాగం చేయలేనివాడు ఎక్కువ వచ్చినా త్యాగం చేయలేడు. ఇది అక్షరాలా నిజం. మాసిదోనియా వారు తమ లేమిలో నుంచి ఎంతో త్యాగం చేశారని పౌలు ప్రశంసించలేదూ? దాతృత్వం హృదయ వైఖరిని వ్యక్తం చేస్తుంది. తెలుసా? యిక్కడ వాడమంటున్నది దేవుడు నీ డబ్బు కాదు. నిన్ను పరీక్షించ డానికి, పరిశీలించడానికి తన డబ్బు నీకిచ్చి, నమ్మకంగా ఖర్చు చెయ్యమంటున్నాడు. మన దాతృత్వ సౌశీల్యం పరలోకంలో మన భవిష్యత్తును నిర్ధారణకు తెస్తుంది.

**దాతృత్వానికి ప్రేరణ**

దేవుని ప్రేమే దాతృత్వానికి ప్రేరణ. కృతజ్ఞతాపూర్వకంగా యివ్వాలి. ఎంతైనా యివ్వొచ్చు. 2 కొరింథి 8:9లో ప్రభువు తనదంతా మనకిచ్చాడు. తనను తానే యిచ్చివేసుకున్నాడు. ఆదిమ సంఘంలో క్రైస్తవులు ఆయా స్థలాలలో కరువులు కాటకాలు వచ్చినప్పుడు ద్రవ్యం పోగుచేసి పంపారు. అపో॥కార్య 4వ అధ్యాయంలో సంఘస్తులు తమ ఆస్తులన్నీ అమ్మి దైవదాసుల కిచ్చి పంచమన్నారు. దాతృత్వం క్రీస్తు ప్రేమను వ్యక్తం చేస్తుంది. సంతోషంగా యిస్తే దేవుడాశీర్వదిస్తాడు. మనసులో నిశ్చయించు కుని, మరీ యివ్వాలి. యివ్వండి. అనేది ఆజ్ఞకాదు. ప్రేమను వ్యక్తం చేసే విధానవే యివ్వటం! యిచ్చే మనసుంటే యివ్వటమొక సమస్యకాదు.

దాతృత్వం క్రమబద్ధమైన స్వచ్ఛంద నియమానుసారమైతే అద్భుతాలు జరుగుతాయి. వర్ధిల్లిన కొలది డబ్బుకు దేవుని సేవార్థమై యిస్తూ వుండాలి. ప్రతి క్రైస్తవ వ్యక్తి డబ్బుకు గృహనిర్వాహకుడు. ఎంత యివ్వాలని ప్రభువు ప్రేరేపించాడో, అంతా తీసి ప్రత్యేకంగా వుంచాలి." ఎప్పుడో ఒకప్పుడు ఎంతో ఒకింత" అనే పద్ధతి సరైన క్రమం కాదు. దాతృత్వం ధారాళమై, నిస్వార్థమై, సదుద్దేశంతో కూడినదై వుండాలి.

**విశ్వాస విత్తనం !**

సమృద్ధిగా విత్తితే సమృద్ధి పంట. దాతృత్వం విశ్వాసంతో విత్తే విత్తనం. ఎలా విత్తనాలు వేస్తారో అలాగే పంటకోస్తారు. ఇది అక్షరాలా నిజం. పుచ్చుకొనుటకంటే యివ్వడం ధన్యత. పుచ్చుకోవడం మానవ లక్షణం. యివ్వడం దైవ లక్షణం. దైవసేవకు ధారాళంగా యివ్వండి. 2 కొరింథి 8:7. "దేవుని ప్రేమలో మీరెంతో అభివృద్ధి చెందుతారు. అలాగే ఈ దాతృత్వ క్రియలో కూడా అభివృద్ధి పొందేలా చూచుకోండి. దైవాశీస్సులు!

## అక్టోబర్ గనుక జవాబులు

**అడ్డం :** 1.ఎఫెసు 2. ఆది 3. స్పందన 5. పది 6. దర్శ7. అక్కర 8. భయ 11.ప్రాకు 13.ముత్యము 14. కత్తి 15. నెగ్గుము 17.ఎము 18. పామరు 22. మినా 23. బాలాకు 24.తలితా 25. అదుల్లాము 27. రబ్బా 28. స్తుతి.

**నిలువు :** 1. ఎజ్రా 2. ఆది 3. స్పర్శ 4. నక్క 5. పరలోకము 6. రయ 7.అకుల 8. భక్తి 10. సత్యము 12. లోకము 13. ముగ్గురు 15. నెమలి 16. రక్షణ 17. ఎల్జాబాదు 19. యోనాతాను 21. య్యకుము 22. మిలిమే (మేలిమి) 25. అబ్బా 26. యూస్తు



# కృతజ్ఞతార్పణ

శ్రీమతి.  యల్.జె.కె.కుమారి.

వ్యకుల మధ్య పరస్పర అవగాహన సహకారం ఉంటే ఇచ్చిపుచ్చుకొనే సాంప్రదాయం కొనసాగుతుంది. వారి మధ్య విబేధాలు తలెత్తితే మాత్రం, ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలకు అంతరాయం ఏర్పడక తప్పదు. కానీ భగవంతునికి – భక్తునికి మధ్య ఇచ్చిపుచ్చుకోవడంలో మనిషిలో తేడా వస్తుందేమో కానీ కృపాసత్య సంపూర్ణుడైన దేవుడు మాత్రం ప్రతిఫలా పేక్ష లేనివాడై (1యోహా 1:14) అడిగే ప్రతివాడూ పొందును. (మత్త 7:8) అనే వాగ్దానమిచ్చిన ప్రేమగల దేవుడు ప్రతీ విషయంలోనూ దేవుని ద్వారా (తప్ప) ఉపకారం పొందుతున్న మానవాళిని సృష్టికర్త యెడల కృతజ్ఞత కల్గియుండాలని దేవుని బలీయమైన కోరిక. సంఖ్యా 29:39. నీ మ్రొక్కుబడులను, స్వేచ్ఛార్పణలను, మీ దహనబలులను కాక వీటిని "నియామక కాలమందు" యెహోవాకు అర్పించవలెనను దేవుని ఆజ్ఞను యూదులు 7 పండుగల రూపంలో ఆచరిస్తున్నారు.

1.పస్కాపండుగ లేక పులియని రొట్టెలపండుగ 2. పెంతెకోస్తు లేదా ప్రధమఫలముల పండుగ 3. పర్ణశాలల పండుగ 4. బూరల పండుగ 5. ఆలయ ప్రతిష్ట పండుగ. 6. ప్రాయశ్చిత్త పండుగ 7. పూరీము పండుగ లేవీ 23:10,11. ప్రకారము యెహోవా మిమ్మును అంగీకరించునట్లు మీ మొదటి పంటలో ఒక పనను యెహోవా సన్నిధికి తీసుకు రావాలని మననుండి కోరడంలో ఉద్దేశ్యం ఆయన లేనివాడని కాదు. యోహా 1:2,3. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండా కలుగలేదు, అని గ్రహించాలి. సర్వసృష్టికర్తయైన దేవునికి గాలిబుడగ జీవితం గల అల్పప్రాణి అర్పణపట్ల ఎంతటి ప్రత్యేక ఆకర్షణ? మూడేళ్ళ ప్రాయం కల్గిన ఒక చంటిపాపను తన తండ్రి ఎత్తుకొని చాక్లెట్ షాపుకి తీసుకెళ్ళి. కావల్సినన్ని చాక్లెట్స్ తీసుకోమన్నాడు. ఆ పాప తన గుప్పిలి నిండా తీసి ఆమె తినకుండా తన తండ్రి చేతిలో పెట్టింది. ఆమె తినకుండా ముందుగా తన తండ్రికి చాక్లెట్స్ ఇచ్చినందుకు ఎంతో మురిసిపోతూ... తన గుప్పిలి

నిండా చాక్లెట్స్ తీసి పాప దోసిలి పట్టమన్నాడు తండ్రి. మూడు లేదా నాలుగు చాక్లెట్స్ పట్టేంత దోసిలి ఆ పసిపాపది ఇంకా ఎన్నో చాక్లెట్స్ మిగిలి పోయాయి. పాప ఒడిలో వేసాడు తండ్రి. ఆ పాప ఆశ్చర్యానికి, ఆనందానికి అవధుల్లేవు (మలాకి 3:10,11. నా మందిరములో ఆహారముండునట్లు పదియవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసుకొనిరండి! దీని చేసి మీరు నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని" సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. దేవుని ఆజ్ఞలు అనుసరించిన విస్తారముగా ఆశీర్వదించబడటం - దేవుని ఆజ్ఞలు (ఇచ్చుటలో) అతిక్రమించి శాపగ్రస్తులైన వారు పరిశుద్ధ గ్రంథంలో ఉండటం గమనార్హం.

**కృతజ్ఞతార్పణ**

హేబేలు యెహోవాకు అర్పణగా మందలో క్రొవ్విన వాటిని తెచ్చెను. (ఆది 4:4). యెహోవా హేబేలును అతని అర్పణను లక్ష్యపెట్టెను.

**అబ్రహాము సమర్పణ**

ఆది14:20 మెల్కీసెదెకునకు అబ్రహాము పదియవవంతు (అన్నింటిలో) దేవునికిచ్చాడు. ఆది 15:15. లెక్కింపజాలని ఆకాశనక్షత్ర ములవలె అబ్రాము సంతతిని ఆశీర్వదించాడు. ఆది22:12 దేవుడు అబ్రాహామును పరిశోధించాడు. అబ్రామునకు ఒక్కడైయున్న తన కుమారుని దేవునికియ్య వెనుదీయలేదు కనుక (ఆది 22:16-18) విస్తారంగా ఆశీర్వదించి దీవించాడని పరిశుద్ధ గ్రంథం తెలియజేస్తుంది.

**మ్రొక్కుబడి (అన్వాచిత) అర్పణలు దేవునికి అసహ్యం.**

కయీను పంట పొలములో కొంత యెహోవాకు అర్పణగాతెచ్చెను. (ఆది 4:3) దేవుడు కయీను అతని అర్పణలను లక్ష్యపెట్టలేదు. (ఆది 4:5) దాని ఫలితం హంతకుడు, శాపగ్రస్తుడైనాడు.

**దేవుడు లక్ష్యపెట్టని అర్పణలు**

(అపో ॥కా. 5:1-11) అననీయ - సప్పీరాలు తమ స్వంత పొలం అమ్మి దాని వెలలో కొంత దాచుకొని తెచ్చి అపొస్తలుల పాదముల యొద్దపెట్టారు. సొమ్మువాళ్ళదైనా దేవునికి అర్పించాలన్న అర్పణలో పవిత్రత లోపించింది. పరిశుద్ధాత్మను మోస పుచ్చుటలో భార్యభర్తలిద్దరు ఏకీభవించారు. పేతురు పలికిన మాటలు (మనుష్యులతో కాదు. దేవునితోనే అబద్ధం ఆడారు) వింటూనే అననీయ మరణించడం - అదే అబద్ధం ఆడిన సప్పీరా కూడా చనిపోవడం గమని స్తుంటే ఆ సంఘటన మనలను భయ భ్రాంతుల్ని చేస్తుంది.

"నీవు దేవునికి మ్రొక్కుబడి చేసికొనిన యెడల దానినిచెల్లించుటకు ఆలస్యం చేయకుము. (ప్రసంగి 5:4) నీవు మ్రొక్కుకొని - చెల్లింపకుండుట కంటే మ్రొక్కుకొన కుండుట మేలని మనము గ్రహించాలి.

**సమర్పణ లోని త్యాగనిరతిని గమనించే దేవుడు**

(యోహాను 6:1:13) ఒక చిన్న వాడి త్యాగబుద్ధిని గమనించాడు దేవుడు. (6:9) తనకున్న 5 యవలరొట్టెలు రెండు చిన్న చిన్న చేపలు సహితం ఇచ్చేసాడు. యేసు (యోహాను 6:11) ఆ రొట్టెలు పట్టుకొని

(తరువాయి 18 వ పేజిలో)

# రానున్న క్రిస్మసు శుభవేళలో........


దుప్పటి అందుకుంటున్న వృద్ధురాలు


ఆత్రంగా భోంచేస్తున్న వృద్ధబిక్షవుడు



చేతుల్లేనికుర్రాడికి తినిపిస్తూ... నవీన్

మా ప్రియ పాఠకుల ప్రార్థనలు, సహకారముతో ప్రతీ క్రిస్మస్ శుభసందర్భంగా పేదలకు క్రిస్మసు విందు, చలికి దుప్పట్లు ఇస్తున్నట్టుగా ఈ సంవత్సరం కూడా ఈ సాంఘిక సేవ జరిగించాలని ఆశిస్తున్నాము. స్పందన ఆధ్యాత్మిక కుటుంబములో సభ్యులైన ప్రతీ ఒక్కరూ ఈ సేవలో సహకరించాలని కోరుతున్నాము.

2006 క్రిస్మసు పండుగ రోజు రాత్రి జరిగిన పేదలకు క్రిస్మసు విందు, చలికి దుప్పట్లు పంచే కార్యక్రమము ఎంతో సంతృప్తినిచ్చింది. రోడ్డు ప్రక్కన కనీసం కప్పుకోటానికి దుప్పటి లేనివారికి దుప్పట్లు పంచుతూ, మంచి భోజనాలు అందజేస్తూ వెడుతూ ఉన్నాము. ఓ షాపు ముందు చలికి కాళ్లుచేతులు ముడుచుకుని పడుకుని ఉన్న ఓ కుర్రాడు కినిపించాడు. వెంటనే అతనికి ఓ దుప్పటి, ఓ చికెన్ బిర్యాని ప్యాకెట్టు యిచ్చాము. కాని ఆ భోజనం తినుటకు అతనికి చేతులు లేవు . అప్పుడు మన టీంలోని సోదరుడు నవీన్ అతనికి భోజనము కలిపి తినిపించారు. ఆ కుర్రాడు ఎంతో సంతోషించాడు. గత సంచికలలో మరో సంఘటన కూడా మీకు గుర్తుండే ఉంటుంది. రాత్రివేళ చలిలో





# రానున్న క్రిస్మసు శుభవేళలో........



బిర్యాని ప్యాకెట్లు



ముగ్గురు చిన్న పిల్లలను సిమెంట్ బస్తాలతో కుట్టిన చిన్న పరజామీద చలిలో పడుకుని ఉన్న దృశ్యాన్ని చూచి వారికి వెంటనే దుప్పట్లు, బోజనం పాకెట్లు ఇవ్వగానే ఆకలితో పడుకుని ఉన్న ఆ పిల్లలు అంత రాత్రివేళలో ఆత్రుతగా ఆ భోజనాన్ని ఆరగించటం చూచాము. మేమేదో గొప్పకార్యం చేశాం అని రాయటం కాదు గాని మనకు ప్రత్యుపకారం చేయలేని ఇలాంటివారికి సేవచేసే భాగ్యాన్ని ప్రభువు ప్రసాదించినందుకు కన్నీటితో ప్రభువును స్తుతించాము. స్పందన పరిచర్యలలో ఇలాంటి అనేక వందల మందికి సాయం చేయటానికి ప్రభువు కృప చూపారు. ఈ సంవత్సరం 1500 బిర్యాని ప్యాకెట్లు చేయాలని, 750 దుప్పట్లు కొనాలని ఆశిస్తూ ప్రార్థిస్తున్నాము. ఈ పరిచర్య చేయుటకు వేల రూపాయలు ఖర్చు అవుతాయి. మా ప్రియపాఠకులు ప్రాముఖ్యంగా ఈ పరిచర్యకోసం ప్రార్థించండి. ఈ పరిచర్యలో మీ వంతు ఏమిటో ప్రభువును అడగండి. ప్రభువు మీకు ఏం చేయమని చెబితే అంతమేరకు ఈ సేవలో సహకరించండి. సమృద్ధి ఆశీస్సులు అనుభవించండి. దైవాశీస్సులు







మరో వికలాంగునికి బోజనం... చలిలో దుప్పటికూడా లేని పిల్లలు - వృద్ధ మహిళ

కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పిల్లలు, స్త్రీలు, వృద్ధులు మినహాయించి లెక్కకు ఇంచుమించు ఐదువేలమంది పురుషులకు వడ్డించి తృప్తిగా తినిన పిదప మిగిలిని రొట్టెముక్కలు 12 గంపలు నింపేలా ఆశీర్వదించాడు.

**విధవరాలి కానుక**

(మార్కు 12:41-44). 12:42 ఒక బీద విధవరాలు వచ్చి రెండు కాసులు వేయడంచూసి. ధనవంతులు వాళ్ళకు కల్గిన సమృద్ధిలోనుండి వేసారు. కానీ యీామె తనలేమిలో తనకు కల్గిన దంతా అంటే జీవనమంతా వేసింది. (12:44)

**అపొస్తలుల ప్రేరణ విశ్వాసుల సమర్పణ**

(అ॥కా 2:44-47) విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగిన దంతయు సమిష్టిగా ఉంచుకొనిరి అ॥కా॥ 2:45. చర,స్థిర, ఆస్థులు అమ్మి అక్కరకొలది పంచి పెట్టారు.. 47 :- నిష్కపటమైన హృదయం కల్గి దేవుని సేవలో అభివృద్ధి పొందారు. నీరాబడి అంతటిలో ప్రధమఫలమును, నీ ఆస్థిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘనపరచుము. (సామె 3:9) అను దేవుని మాటలు పాటించి ఆధ్యాత్మికంగా అభివృద్ధిచెందారు.

నేడు మనం దేవుని బిడ్డలుగా చేయవలసిన కర్తవ్యం మనం పొందిన ప్రతీ"ఈవీ" దేవుని ద్వారా పొందుతున్నాం అనే కృతజ్ఞత కలిగి, ప్రథమ ఫలమైన యేసుక్రీస్తు ప్రభువుకు అర్పణగా, మన కొరకు త్యాగమైయున్న దేవునికి మన హృదయం అర్పించాలి. మార్పుచెందిన హృదయంతో కృతజ్ఞతా స్తుతర్పణలు చెల్లిస్తూ ఆయన గుమ్మము లలో ప్రవేశించాలి (కీర్త 100:4) ఉత్సాహముగా ఇచ్చువారిని దేవుడు దీవిస్తాడు.

## అక్టోబర్ నెల గ.ను.క ఆల్‌కరెక్టుగా జవాబులు వ్రాసిన వారిపేర్లు

జంపా కోమలదేవి-విజయవాడ,కె. సురేష్ బాబు- ఒంగోలు,కె.కనకమ్మ,బి. కెంపు రత్నకుమారి,శ్రీమతి దీనా క్రిష్టఫర్- హన్మకొండ, కె.శెశీల్య, వై.మాణిక్యం-కంచికచర్ల, భారతి దేవప్రియం -కడప,కె.సి.యల్.సలోమి- భీమవరం, కె.సమూయేలు-తాడేపల్లిగూడెం,ఆలూరి నిర్మలాదేవి, దాట్ల అక్షాణి, ఎస్.కమలమ్మ-ఒంగోలు,వి.జడ్సన్-అమీనాపురం,కె.జె.మార్గరెట్-గుత్తి, ఆర్.యం.విజయకుమారి, సునందయేసుపాదం-మదనపల్లె, యు.ఎస్.పురుషోత్తం-తాడిపత్రి, హెప్సిఎలీషా, వి.ఎల్.నరసమ్మ -విస్సన్నపేట, బి.రెజినా-నెల్లూరు, టి.సువర్ణ రాజారత్నం-కడప, ఎస్.షూలమతి-రాజోలు, ఆర్.జి.సుశీల-పుంగనూర్, జె.ప్రసాదరావు-గోకవరం, జి.కె.యల్. సుగుణమ్మ, జి.యస్. సునీతరావు - బద్వేల్, టి.శాంతిరత్నం-ఎలూరు, ఆర్.సుబ్బలక్ష్మమ్మ -డోన్, యం.మేరి-కె.కొత్తపాడు, జి.హేమలత-రాజంపేట, బి.ఆశీర్వాదం- తూ॥గో॥జిల్లా, డి.షాలేముకుమారి, నిర్మలాదేవదానము-హైదరాబాద్, కె. విమల-కొత్తవలస, పి. దేవదానము-నంద్యాల, ఐ.జెర్మియా- ఖమ్మం, మాధవిఅశోక్-పర్చాల, వి.ఫ్లారెన్స్-దొండపాడు, జి.పాల్, జి.రిబకమ్మ -కలశపాడు,యాదల నిరీక్షణకుమార్- ఇనమనమెళ్ళూరు, ఆలూరి నవమ్మ- పొదిలి, హెచ్.సరళమ్మ -గిద్దలూరు, వి.యల్. ప్రసునాంబ-గుంటుపల్లి, యం.లీలమ్మ- జమ్మలమడుగు, ఎ.యస్.ప్రభావతి,ఆర్.జయమ్మలాబాను-గుంతకల్,ఎ.మునిరాజు -కడప, హెప్సిబా- అల్లగడ్డ, డి.డి.డి.ఎ.మణి-విశాఖపట్నం, హెచ్.ఫ్లారెన్సమ్మ-చిన్నదోర్నాల,శ్రీమతి లతాసుందరం- కడప, జె.ప్రశాంతి-తిరుపతి, జి.శిరిష-నెల్లూరు,బత్తుల అనీమేరి,కె.విమల-హైదరాబాద్, వి. కమల -చీలమకుర్, జాయ్‌బ్లెస్సి-కదిరి.

**దాతృత్వపు విలువలు**



# అర్పణలోని ఆశీర్వాదం - దాతృత్వంలో దాగియున్న దీవెన

**జామి రవికుమార్**

గతకాలపు శ్రమలనుండి శోధనల నుండి మనలను తప్పించి, రక్షించి, కంటికి రెప్పలాగ కాచి సంరక్షించిన కరుణామయుని పాద సన్నిధిలో వినయమైన మనస్సులో మనం కృతజ్ఞత స్తుతులు చెల్లింప బద్ధులమై ఉన్నాము. ఈ వత్సరం మనలను, మన బిడ్డలను విద్యా, వివాహాలలో, ఉద్యోగ ఆరోగ్యాలలో దిన దినం ఎదగటానికి తన కృప, కనికరాలను మనయెడల విస్తరింప జేసి మన దన నిధులను నింపిన యేసయ్య దివ్య సముఖానికి, సకుటుంబ సపరివార సమేతంగా వెళ్ళి దేవుడు మనలను దీవించిన కొలది, ఆశీర్వదించి, అభివృద్ధి పరిచిన కొలది, ఆయన మందిరంలో ఆహారముండు నట్లు, ఆయన నమ్మిన సేవకులు పోషించబడు నట్లు" ఆయన ప్రేమించిన బిడ్డల అవసరాలు తీరునట్లు మన అర్పణలును అర్పించవలసిన వారమై ఉన్నాము. తన రుధిరాన్ని చిందించి మనకి రూపాన్ని ఇచ్చి తన త్యాగంలో మనకు జీవాన్ని అనుగ్రహించిన త్యాగమూర్తి యేసయ్య ప్రేమకు కృతజ్ఞతలు చెల్లించడానికి సిద్ధమైన మనస్సుతో "ఉన్నామో" లేదో పరిశీలన చేసుకొందాము. మన కాలగతులు ఏ దేవుని వశంలో ఉన్నాయో ఆ జీవం కల్గిన దేవుని సన్నిధిలో హృదయపూర్వకంగా కానుకలు అర్పించే మరో శుభతరుణాన్ని దేవుడు మనకు అనుగ్రహించాడు.

మన దేవుడు "ఉదయ సాయంత్రముల ఉత్పత్తులను సంతోషభరితంగా చేస్తూ మనకు మహదైశ్వర్యము కలుగజేయుచున్నాడు" (కీర్తన 65:8,9). ఈ విధంగా మనం ప్రతిదినం దీవెనలతో నింపుతున్నాడు. దావీదు మహారాజు సెలవు ఇచ్చిన రీతిగా " భూమియు దాని సంపూర్ణతయు, లోకమును దాని నివాసులను యెహోవావే" (కీర్తన 24:1)

**అంతా దేవునిదే!**

మనం దేవునికి అర్పిస్తున్న అర్పణలు, కానుకలు దేవుని చేత మనకు అనుగ్రహించబడినవే. అందుకే దావీదు మహాభక్తుడు దేవుని మందిర నిర్మాణానికి ఇశ్రాయేలు రాజ్యపు చక్రవర్తిగా వెండి, బంగారాలను సమకూర్చినది కాక తన వంతుగా తాను సంపాదించు కొన్న బంగారంలో

6000 మణుగుల శ్రేష్టమైన ఓఫీరు బంగారాన్ని 14000 మణుగుల పుటము వేయబడిన వెండిని దేవునికి అర్పించాడు. 1మణుగు బంగారం 8 కేజీలు సమానం. అంటే 43000 కేజీల బంగారాన్ని, 1,12000 వెండిని సమర్పించి (1 దినవృత్త 29:4)" సమస్తమును నీవల్లే కలిగెను, నీ స్వసంపాద్యంలో కొంత మేము నీకిచ్చుచున్నాము. ఈ విధంగా ఇచ్చు సమార్థ్యమును మాకిచ్చిన వాడవు నీవేనని (1దినవృత్తా. 29:14).

చాలామంది పితరుల జీవితాలను గుర్తు చేసుకుంటే దయనీయమైన స్థితి. ఇప్పటి మనస్థితి, ఆస్తి దేనికి లోటు లేకుండా నిండారగా దీవించాడు. అటువంటి దేవునికి నీవు ఏమి, ఎంత అర్పిస్తున్నావో పరిశీలన చేసుకో? తండ్రి సహవాసాన్ని త్యాగం చేసి ''తన దారిద్రము వలన మనం ధనవంతులము కావాలని మన నిమిత్తము దరిద్రుడయ్యాడు'' (2కొరింధి 8:9) అటువంటి త్యాగమూర్తి త్యాగానికి నీవు చెల్లిస్తున్న వెల ఎంత? **(కానుక)** ?

మన జీవితంలో దశమ బాగాన్ని దేవునికి ఇవ్వడమే మహా ఘనకార్యంగా భావించే దేవుని చేత దీవించబడ్డ నవగాగరపు క్రైస్తవులము మనము. దశమ భాగం అనే భావన దేవాధి దేవుని ఆలోచన నుండి పుట్టింది కాదు. మోసగాడిగా ఉన్న యాకోబు తన అన్నను మోసం జేసి పారిపోతున్న సమయంలో దేవుడు యాకోబును బేతేలు అనే స్థలంలో దర్శించినప్పుడు అతడు తన మిడి మిడి జ్ఞానంతో లోకపు ఆశలతో లాభనష్టాలను బేరీజు వేసుకొని దేవునితో చేసుకున్న వ్యాపారపు ఒప్పందం. ఈ దశమ భాగము "నీవు నాకు తోడైయుండి నేను వెళ్లుచున్న యీ మార్గంలో నన్నుకాపాడి, తినుటకు ఆహారము ను ధరించుకొనుటకు వస్త్రములను నాకు దయచేసినయెడల యెహోవా నాకు దేవుడై యుండును. మరియు స్తంభముగా నేను నిలిపిన యీ రాయి దేవుని మందిరమగును మరియు నీవు నాకిచ్చు యావత్తులో పదియవంతు నిశ్చయముగా నీకు చెల్లించెదనని మ్రొక్కుకొనెను (ఆది 28:21,22). ఈ యాకోబు దేవునితో చేసిన బేరసారాలను పరిశీలించినట్లయితే దేవుడు అతనికి తోడైయుండాలట, కాపాడి క్షేమాన్ని దయచేయాలట ఆహారాన్ని వస్త్రాన్ని దయచేయాలట ఆవిధంగా అరడజను షరతులు, నిబంధనలు దేవునికి పెట్టి అప్పుడు దశమ భాగాన్ని ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. అటువంటి యాకోబు ఒక దినాన యబ్బోకు రేవులో రాత్రికాల సమయంలో దేవుడు అతనిని దర్శించినప్పుడు తన పాత రోత జీవితాన్ని విడిచిపెట్టి తన్నుతానే దేవునికి అర్పించుకున్నాడు. అతని వారసులు అయిన మనము మాత్రము దశమ భాగం అనే స్థితిలోనుండి పైకి ఎదగలేక పోతున్నాము. **దశమ భాగం అంటే కేవలం ఒక నెలలో వచ్చే ఆదాయంలో 10వ భాగం మాత్రమేకాదు. ఈలోకంలో నాది అని నీకున్న ప్రతిదానిలో నీవు దేవునికి దశమ భాగం అర్పించాలి. నీ విద్యావివేకం నీ స్వరం, నీ సామర్ధ్యం, నీ సమయం , నీ సంతానం, ప్రతి దానిలో దేవునికి నీవు దశమ భాగం చెల్లించాలి.**

కనీసం మనలో కొందరు ఈ దశమ భాగాన్ని సైతం దేవునికి అర్పించకుండా దొంగిలించేవారు ఉన్నారట!" మీరు నాయొద్ద

దొంగిలితిరి, పదియవ భాగంను ప్రతిష్టి తార్పణలను ఇయ్యక దొంగిలితిరి." (మలాకి 3:9) ఒకవేళ మన జీవితంలో దేవుని మందిరంలో ఆహారము ఉండునట్లు పదియవ భాగాన్ని దేవుని మందిరపు నిధిలోనికి తీసుకొని వచ్చేవారిగా ఉన్నట్లయితే ఆకాశపు వాకిండ్లను విప్పి పట్టజాలనంత విస్తారంగా దీవెనలను కుమ్మరిస్తానని వాగ్దానం చేసాడు. ఆ వాగ్దానం చేసిన దేవుడు నమ్మదగిన దేవుడు మాట తప్పని దేవుడు మీరూ దీవించబడాలని ఆశ ఉంటే దేవునికి ఇచ్చి శోధించు. అప్పుడు నీవు దీవెనలతో దీవించబడతావు. ఎందుకంటే "ఐశ్వర్య ఘనతలను, స్థిరమైన కలిమియు నావద్ద యున్నవి" (సామెతలు 8:18) అని సెలవిచ్చిన దేవుడు "నన్ను ప్రేమించువారిని ఆస్తికర్తలుగా చేసి వారి నిధులు నింపుదును అన్నాడు." (సామెతలు 8:21) నీవు ఆయన ను ప్రేమించి కానుకలు అర్పించేవాడిగా ఉంటే పైన చెప్పిన ఆశీర్వాదాలు అన్ని నీవే.

పరిశుద్ధాత్మ బలమైన కార్యాలు చేస్తున్న ఈ నూతన నిబంధన కాలంలో దశమభాగం అనే భావన నుండి విడుదలపొంది "తనలేమిలో తనకు కలిగిన జీవనమంతయు కానుకగా వేసిన" (లూకా 21:3) ఆమె కోసం యేసయ్య స్వయంగా సాక్ష్యం ఇచ్చిన బీద విధవరాలువంటి దేవుని ప్రేమించే వారు కావాలి. దేవుని సేవ నిమిత్తము తన చర స్థిరాస్తులు అమ్మి ప్రభుసేవకై అపొస్తుల పాదాల వద్ద పెట్టిన బర్నబ లాంటి యోధులు కావాలి. దేవుని రాజ్యవ్యాప్తి నిమిత్తము. తమ సుఖాన్ని సంతోషాన్ని ధనాన్ని ప్రాణాన్ని సైతం త్రుణప్రాయంగా ఎంచి ప్రభువు సేవలో ప్రాణార్పణగా పోయబడ్డ పౌలులాంటి అపొస్తులులు కావాలి. నా ప్రియ సహోదరి, సహోదరుడా నీ అభివృద్ధి ఇతరులకు ఆశీర్వాదం కావాలి. తన వద్ద ఉన్న అయిదు రొట్టెలు, రెండు చిన్నచేపలు తన కోసం దాచుకోకుండా అనేక వేలమంది ఆకలి తీర్చడానికి యేసయ్య కృపగల హస్తాలలో పెట్టి ఆకలి తీర్చి పన్నెండు గంపల ఆశీర్వాదంను తన ఇంటికి మోసుకొని పోయిన ఆ చిన్నబిడ్డ మనకు ఆదర్శంకావాలి. "వారు నిరుపేదలైన దాతృత్వ ములో బహుగా విస్తరించి తమ సామర్థ్యం కొలదియే కాక సామర్థ్యం కంటే ఎక్కువగా తమంతట తాముగా గుప్పిలి విప్పిన మాసిదోనియా సంఘం మనకు మాదిరి కావాలి." (2కొరింథి 3:4) మన" దేవుడు ఉత్సాహంగా ఇచ్చువారిని ప్రేమిస్తారు!

దేవుడు "బీదలు దేశంలో ఉండక మానరు గనుక నీ సహోదరులగు దీనులకును బీదలకును అవశ్యముగా నీ చెయ్యి చాపవలెనని నీ కాజ్ఞాపించు చున్నాను. (ద్వితీ.కా15:11) మన వ్యక్తిగత జీవితంలో దిక్కులేని వారికి విదవరాండ్లకు సహాయం చేయుటను నిజమైన భకి. యాకోబు 1:27 పుచ్చుకొనుట కంటె ఇచ్చుట ధన్యత(అపో 20:35)ఇచ్చేవారి చెయ్యిపైన ఉంటుంది. పుచ్చుకునే వారి చెయ్యి కింద ఉంటుంది. "నీవు పైవాడిగా ఉందువు గాని క్రిందివాడిగా ఉండవు." (ద్వితీయో 28:14) "నీవు అనేక జనములకు అప్పు ఇచ్చెదవు గాని అప్పుచేయకుందువు అని ఆశీర్వదించాడు" (ద్వితియో 28:12)

మహిళా స్పందన



# నవజీవిత పటాన్ని చిత్రించు

శ్రీమతి గ్రేస్ విజయ

**కీర్తనలు 43:5 నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు?దిగులు బాధల్లో కారణాలు మనకర్థం కావు దేవుని కన్నీ తెలుసు. మత్తయి 6:32 నీ పరలోకపు తండ్రికి తెలియును.**

దేవుని సృష్టి ఎంత అందమైనదో ఎపుడైనా ఆలోచించారా? ఈ లోకంలో ఏ చిత్రకారుడే గాని, ఎంత విలువైన పెయింటింగ్‌లే గాని ఆ అందాలను సరైన విధంగా వర్ణించలేవు. నిత్యమూ మనము చూస్తూన్నా అందులోని ఆనందాన్ని అనుభవిస్తున్నామా? నీలి రంగు ఆకాశం! పచ్చని రంగుతో గడ్డి, పసుపు, ఎరుపు మొ।। రంగులతో బంగారు కాంతులీనే సూర్యాస్తమయాలు. ఒకే పుష్పం ఎన్ని రంగులో! రెయిన్‌బో లేదా మేఘధనస్సులో రంగుల యింపు యిలా ఆలోచిస్తే మన జీవితమనే కాన్వాసుపై మన జీవితానుభావాలను నేర్పుతో చిత్రించిన పటంలో మనలను మనము ఆత్మీయ నేత్రాలతో చూడగలము. విరామంగా అవగాహనతో అందమైన చిత్రపటంగా మన తర్వాత తరం వారికి ఆనందాన్ని అందించగలమా?

మెరీనా, బాధ్యతగల గృహిణి. ఉద్యోగంలో ఒత్తిడి తట్టుకోలేని పరిస్థితులలో ఉద్యోగానికి రాజీనామా యివ్వాలని కుటుంబముతో సంప్రతించే అవకాశం యివ్వకుండగానె ఒక రోజు అధికారికి చెప్పి పని విరమించింది. అనుకోని నిరాశ, బాధ ఆవరించాయి.

ఆఫీసులో అధిక సమయం వెచ్చించడంవల్ల, భర్తా బిడ్డలతో గడిపే అవకాశం తగ్గడం మెరీనాను బాధించింది. విలువైన జీవితాన్ని ధనార్జనకై వెచ్చించి ప్రేమానురాగాలకు దూరంకావడం బాధించింది. జీవితానికి డబ్బు అవసరమేగానీ కానీ ఆవేశంతో చేసిన పనివల్ల యింటిల్లిపాదీ ఇబ్బందితో సతమతం కావాలి కదా అని కాసేపు ఆలోచించింది. తన తాత్కాలిక తొందరపాటు పనివల్ల రేపు జరగబోయే పరిస్థితులెలా ఎదుర్కొనాలో అర్థంకాని స్థితిలో పడకమీద వాలి రోదిస్తూ గడిపింది. మగత నిద్రలో తన బాల్యం గుర్తుకు వచ్చింది. అందమైన బాల్యదినాలు అపురూపమైన జ్ఞాపకాలలో తెప్పరిల్లింది. దైవభక్తి ప్రధానంగా, కంఠత వాక్యాలు ఉజ్జీవ

గీతాల జోరులో యిల్లంతా సందడిగా, భక్తిగల సన్నిహితుల రాకపోకలు, వారకూడికలు, పార్టీలు క్రైస్తవనాటికలు, పాటల ఆటల పోటీలు, కారల్ సంగీతాలతో ఆనందంగా గడిపింది.

మెరీనాకు చిన్ననాటి అనుభవాలన్నీ గుర్తుండేవి. తనకు ఐదు సంవత్సరాల వయస్సులో ఒకటవ తరగతి చదివే రోజుల్లో ఆమెకు చాలా ప్రీతిపాత్రయైన ఉపాధ్యాయిని మెరీనాను ప్రేమగా చూచేది. చాలా విషయాలు చెప్తూ, అందమైన బొమ్మలు గీయడానికి సహకరించేది. ప్రతి ఒక్కరికి చిన్న పెట్టెలో క్రేయాన్లు (మైనపు పెన్సిళ్ళు) వసుపు పచ్చని రంగును, వసంత శోభరంగనీ, ఎరుపురంగు పండుమిరప రంగనీ, గులాబీరంగు, రాజకుమారీ రంగని ఆ రంగుల వాసన ఎంతో ఆహ్లాదంగా ఉండేది. ఇక 6వ సంవత్సరంలో తెల్లని కాగితాలబొంత పట్టుకొని, వాళ్ళమ్మ వంటపని చేసే సమయంలో బూడిదరంగు బల్లపై కాగితాలన్నీ పరచి, ముదురు రంగులన్నీ కలిపి, సూర్యకాంతివంటి ఆరెంజి, బ్లూ, వైలెట్ యిట్టి ఇంద్రధనస్సు రంగులతో వివిధ దృశ్యాలు గీసేస్తూ ఆ రంగులను చూసస్తూ గంతులు వేసస్తూ ఆనందించేది. అసలు రంగు అనే భావం దేవుని గొప్ప అపురూప బహుమతి గా అనుభూతినిచ్చి ఉత్తేజాన్నిచ్చేది.

బాల్య జ్ఞాపకాలు ముగిసాయి. వాస్తవంలో కన్నీటితో ఉద్యోగంలేని మెరీనాకు మెల్లని స్వరం వినిపించింది. "లేమ్మా మెరీనా, నీ పడకగది గోడపై అందమైన చిత్రాల్ని గీయి."

"బొమ్మలు గీసస్తూ కూర్చుంటే డబ్బేలా వస్తుంది? సరదాగా చేసే పనికిది సమయం కాదు" అని తలంచి ఆలోచించసాగింది. "సమస్యలన్నీ సర్దుకుంటాయిలే. లేచి పటాన్ని గీయమ్మా" ఆప్యాయంగా హెచ్చరించిన ప్రభోదాన్ని స్వీకరించింది. "తెల్లని గోడ, అందమైన రంగులు, చేతిలో కుంచె. యివే నీకొక గమ్యాన్ని సూచిస్తూ అవసరాలన్నీ చక్కబెట్టగలవు. నా మాట నమ్ము" నొక్కి వక్కాణించిన భావం,

***నా ప్రాణమా, నాలో నీవు ఎందుకు కృంగియున్నావు. యెహోవా యందే యింకనూ.........నిరీక్షణ ఉంచుము***

ఆ పాట నోటికి అప్రయత్నంగా రా సాగింది. నిరీక్షణ, ప్రోత్సాహం, ఉత్సాహం యివన్నీ ఆవరించిన ఆనందంతో చిన్న నిచ్చెన, గ్యారేజిలో రంగుల డబ్బాలు చేపట్టి, బట్టలు మార్చుకొని కళ్ళు మూసికొని ప్రార్థించింది.

ప్రభూ, నీవు నన్ను చూస్తున్న రీతిగా నాలోని తలాంతును గ్రహించి, ఉపయోగించడం నేర్పండి. క్రొత్త అనుభవాలు అవకాశాలుగా, ప్రగతి పథంలోకి నడిపించండి!! ఆమెన్.

బాల్యంలో బూడిదరంగు బల్లపై గీచిన పూలు స్మరణలో అందమైన జినియాలు, ట్యూ లిప్స్ గులాబీ అలా రకరాకాల పువ్వుల గుచ్ఛాలను, రంగులతో ఆకుల కలయికతో చిత్రించింది. మంచంపై పరుండి చూసే స్థలాల్లో కూడా అందంగా చిత్రాలు గీయగల్గింది.

ఉద్యోగ విరమణ వార్త అందర్నీ ఆశ్చర్య పర్చింది. కాస్త కలవరపడ్డారు కూడ. ఆర్థిక యిబ్బంది అనే సమస్య పర్వతంలా

బాధించగా పాల్ తేరుకొని, మెరీనా, మనము దేవుని చిత్తంలోనే ఉన్నాము. అనుదినం ప్రభువు నడిపింపు మనకుంది. మనకిష్టమైన పాట గుర్తుందా? ఉద్యోగ లేమిలో ధైర్యంకావాలి.

"శక్తి చేత కాదనెను
బలముచేత కాదనెను
నా ఆత్మద్వారా దీనిచేతునని
యెహోవా సెలవిచ్చెను."

గొప్ప పర్వతమైన, నీవెంత దానవు? చదును భూమిగా చేయగల శక్తి మంతుడే మా దేవుడు అన్న భావం వారిని ఆదరించింది. "మెరీనా మనము ఎదుర్కొనే గొల్యాతులు, దాట వలసిన ఎఱ్ఱసముద్రాలు, పడగొట్ట వలసిన యెరికోగోడలు, యివన్నీ మన దేవునికి తెలుసు ఆ దేవుడే మనకు సరియైన మార్గాన్ని చూపి తన ఐశ్వర్యం చొప్పున మన ప్రతి అవసరాలు తీరుస్తారు. నీవీ రోజు బ్రష్పట్టుకొని పాటలు పాడుతూ క్రొత్త చిత్రాల చిత్రీకరణతో ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా ఉన్నట్లు గమనిస్తున్నాను. దేవుడే క్రొత్త మార్గం చూపిస్తాడు. మెరీనా బిడ్డలు భర్త పడకగదిలో పటాన్ని అభినందిస్తూ చప్పట్లు కొట్టి కృతజ్ఞత తెల్పారు. మెరీనా వారి గుర్తింపుకై దేవుని స్తుతించింది.

మెరీనా కుమార్తె రోజీ పుట్టిన రోజు వేడుకకు కృతజ్ఞతగా ప్రార్థనా సమావేశాన్ని ఏర్పరచారు. బంధువులు స్నేహితులు విచ్చేసారు. యిల్లంతా అందమైన పెయింటింగ్‌లు వారిని విపరీతంగా ఆకర్షించాయి. వారిలో ఒక వనిత తల్లి కాబోతుంది. "పిల్లలు మెచ్చే చిత్రాలను మాయింట్లో చిత్రించగలవా మెరీనా?" అని ప్రాధేయపడింది. సరేనని మరుసటి రోజే వెళ్ళి చిత్రించింది. కార్టూనులో డిస్నీ బొమ్మలతో అందమైన చిత్రాలు చిత్రంగా గీచి అందరినీ పరవశింపజేసింది.

"నీవు గీచిన పటము నాకెంతో నచ్చింది. నా చిన్న బహుమతి యిదిగో" అని కవరులో థ్యాంక్యూ కార్డులో 200డాలర్ల (సుమారు 10వేల రూపాయలు) సొమ్ము పెట్టి యిచ్చింది. "మెరీనా, డబ్బుతో విలువ కట్టలేని నీ కళాత్మక సృజనాత్మక తలాంతులు దేవుడు నీకిచ్చిన వరం. ఎంతో విభిన్నమైన యీ కళ నిచ్చిన దేవుని స్తుతిస్తూ యిది నీవు వృత్తిగా చేయగల్గితే నీ కుటుంబ అవసరాలకు ఉపయోగ పడతావు. ఆలోచించు"

మెరీనా ఆశ్చర్యంగా భర్తకందించిన కవరును బట్టి మెరుపువలె దేవుని స్వరం జ్ఞాపకము వచ్చింది.

మెరీనా, నీ చిత్రాలలో వసంతం చిగురించిన భావాలు, ప్రకృతి దృశ్యాలతో కీర్తనలు 19 అధ్యాయంలో ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. సర్వ సృష్టి దేవుని స్తుతిస్తాయి. ఆ భావం ప్రతి క్రైస్తవ హృదయాల్లో తళుక్కు మంటుంది.

మెరీనా చిత్రాలు దేవుని నడిపింపుతో ఆ ప్రేరణలో ఆరంభించినవి గనుక, అవి చూచిన వారిలో కొందరు ప్రత్యేకంగా ఆమె చిత్రపటాలు చిత్రించుకొన్న చిత్రాలకు సొమ్ము చెల్లించడం పరిపాటిగా, మెరీనా కూడా ఆర్థికంగా పాల్‌గార్కి సహాయ పడసాగింది. దైవగ్రంథంలో అమూల్య వాగ్దానాలను లిఖించడం ప్రారంభించింది.

దేవుడు మిమ్ములను మీకుటుంబాలను నిండారుగా దీవించును గాక ఆమెన్!

# బోధించేవారికోసం క్లుప్త ప్రసంగాలు




**దేవునికి సమర్పించేవి**

1. మన హృదయాలు సామెతలు 23:26
2. మన శరీరాలు రోమా 12:1-2
3. మన సమయాన్ని ఫిలిప్పి 2.4
4. మన ధనాన్ని మలాకీ 3:8-12
5. మన కుటుంబాలను యెహోషువ 24:15; ఆది 7:7
6. మన ప్రాణాలను. రోమా 16:4
7. మన జీవితాలను గలతీ 2:20
8. మన సమస్తాన్నీ ఫిలిప్పీ 3:7-11
9. మన స్వచిత్తాన్ని మత్తయి 26:39
10. దేవుని కోసం సమకూర్చేవి లూకా 12:21

**దేవునికి ఏమివ్వాలి? ఇస్తే ఏమౌతుంది?**

1. నీ రాబడి అంతటిలో ప్రథమ ఫలాన్ని.సామెతలు 3:9-10.
2. కన్నీళ్ళతో విత్తితే ఆనందగానంతో పనలు.2 కొరింథి 8:1-4.
3. యిస్తే దేవుని శీర్వాదం.సామె10:22.
4. ఆస్తికర్తలుగా చేసే దేవుడు, నిధులు నింపే దేవుడు.సామెతలు 8:2.
5. ఆత్మల రక్షణకై యిస్తే, లూకా 16:9.
6. మంచి పదార్థాలన్నిటిలో భాగం. గలతి 6:6-7.
7. ఆకాశపు వాకిండ్లను విప్పే దేవుడు. మలాకీ 3:8-12.
8. ఉత్సాహంగా యిస్తే ప్రేమించే దేవుడు.2 కొరింథి 9:6.
9. మనలను ధనవంతులును చేసే దేవుడు.2 కొరింథి 8:9.
10. అన్న వస్త్రాలు లేకుండా వుండేవారికి యివ్వాలి.యాకోబు 2:1-14.
11. దిక్కులేని పిల్లలను విధవరాండ్రను ఆదరించాలి.యాకోబు 1:27.
12. క్రియతో దేవునికి యివ్వాలి. 1 యోహాను 3:16-18.
13. సహోదరుని ప్రేమించే దాతృత్వం 1యోహాను 4:20-21.
14. అక్కరకు వచ్చే ధనము. ప్రసంగి 10:9.
15. పరలోకంలో ధనం సమకూర్చు కొనుట.లూకా 6:19-20.
16. మనకోసం సమకూర్చుకోకూడదు. లూకా 12:21.
17. ప్రియులు నిద్రిస్తుండగా యిచ్చే దేవుడు.కీర్తన 127:2.
18. యిహమందు ధనవంతులైనవారు. 1 తిమోతి 6:17-19.
19. దేవునిని, సిరిని ప్రేమిస్తే...... లూకా 16:13.
20. ఆస్తికలవారు దేవుని రాజ్యంలో ...... లూకా 18:24-25.
21. ధనవంతుడైన అబ్రహాము .....ఆది 13:2.
22. పేదరికము - ఐశ్వర్యము సామెతలు 30:8-9.
23. ధనం హెచ్చినా లక్ష్యపెట్టకూడదు. కీర్తన 62:10.
24. ఆశీర్వాదం, ఐశ్వర్యమిచ్చే దేవుడు. సామె 10:22; కీర్తన 127:2
25. యెహోవా ధనమే వారికి ఐశ్వర్యము. యెషయ 33:6.
26. దేవుడు కాపరిగా వుంటే లేమికలుగదు.కీర్తన 23:1.
27. దేవుడు తన భక్తులను కరువులో కీర్తన 33:10-19.




## GIVING IN GOD'S WAY

Did you know that in the Bible mentions:

• Pray or prayer 289 times, • Love 363 times, and • Give or giving 1043 times?

God has put a tremendous emphasis on giving in His word. Why?

Because we are naturally selfish and stingy so giving is hard for us, - But God challenges us to give

• Give of our time, • Give of our finances

• Give our talents

As we do, we increase the kingdom of God here on this earth and receive material, spiritual and emotional blessings in our lives.

I want to bring to your attention three principles about giving.

Is the Seed In The Barn?

2 Cor. 9:6-10 — As we read this something is brought out clearly by the Lord

A. The Law of the Harvest applies to your finances

• Yes, the principle of sowing and reaping applies to your giving

We have to have a farming or gardening mentality when it comes to our finances

• This simple observation can revolutionize your perspective on generosity if you really take it to heart

What is the Law of the Harvest? Three simple things:

### 1) We reap later than we sow

• We don't sow some seed and expect the next day for a plant to come up. It takes watering, sunshine and time

• So it is with our generosity. We do not reap a

return immediately. It takes time, faith & thanksgiving

• But rest assured, just as a seed will produce a plant, your generosity will result in a return – just later

**2) We reap more than we sow**

• Plant an apple seed – that yields an apple tree

• That apple tree produces apples that all have many seeds in them

• The one seed will produce hundreds of apples, hundreds of seeds

• We are told here in no uncertain terms that this applies to our giving.

• 2 Cor 9:10 – "multiply the seed that is sown"

**3) We reap in proportion of what we sow**

"Remember this: Whoever sows sparingly will also reap sparingly, and whoever sows generously will also reap generously" 2 Corinthians 9:6-7 (NIV)

• There is a correlation between how much you give and how much blessings you will receive.

• Just as in farming - The more you sow, the more you will reap

This principle has been taken to extremes – we hear of all kinds of crazy promises from radio and TV preachers –

"Send me a dollar and God will give you 10 back!"

This principle is wrongly used so as to make people think it is a way for God to make them rich.

• Kind of like a heavenly slot machine – put in a dollar, hit three bars and get a bucketful of money

• Paul wasn't talking to people who were trying to get rich

• He wasn't trying to get their money. He already had it

• He wants us to go beyond our fear of giving and cross the line to generosity.

• He wants us to know that it is safe to obey God and give.

• This is good news for people who have a problem with giving

When you give away something valuable, it feels like a loss.

• You had something, not you don't – so you don't feel motivated to give more

• Here the bible puts it is a different light, a way that we should think about giving

• It is saying that If we give to God's work, you are not giving something away, but sowing a seed

• It is not a loss, but an investment that will bring returns

The farmer doesn't lose seed when he plants it in the ground, he gains a crop.

Is Your Seed Still In the Barn? – show power pt. picture

of seed sacks sitting in a barn

What rational farmer would say:

"I can't sow my seed that I have in my barn, because then I would not have any seed any more. What would happen if I needed this seed?"

• Any farmer or gardener knows that if they want a crop, they have to sow their seed.

It doesn't benefit him to stuff his pockets full, neither does it do any good to pray,

"Oh God, please give me a crop. I not sure I can sow any seed, but God I am trusting you to get involved. I am believing you to give me a crop, but I am holding onto my seed."

• The logical, wise thing to do is to sow financial seed in giving to the work of the Lord.

• When we give to the Lord, he promises here that it will be just like sowing seed in a farm – you will reap if you sow

The only question for us is: Is the seed still in the barn?

This investment - Sowing has a material as well as a spiritual side to it.

Material side to it is this – as you give, God will supply your needs as well as more resources for giving

2 Cor 9:10-11 – read

• The seed that is in the barn can cause you miss out on financial blessings that God wants to give you

• There is more than giving as sowing seed so we can receive more money from God

There is another way this seed can stay in the barn that has more impact on our spiritual lives

Spiritual: Giving increases your spiritual rewards. There is a spiritual return for your giving

God is up to something in this world and needs our finances to accomplish it.

When we get involved with Him in sowing and giving, we are taking our place in a plan that is much bigger than our life,

• Bigger than our world
• Bigger than our wants
• Bigger than our sack of seed.

We are participating in God's plan, His agenda for the world

What is God's agenda?


God is concerned about the poor and the Great Commission. — That is what He is about

• He has made a promise to care for the poor people and made a promise that the world will be evangelized.

• He is committed to those objectives - Those objectives are going to cost money

• God will get the money from somewhere, but he would rather partner with his

*బాలస్పందన*



# మొండితనం

ఒక ఊరిలో సీతయ్య అనే రైతు ఉండేవాడు. అతడి కుమార్తె వివాహంలో ఊరేగింపునకు గుర్రం కావాలనుకున్నాడు. అదే ఊరిలో గుర్రాలు అద్దెకిస్తున్న సలీంఖాన్ దగ్గర ఓ గుర్రాన్ని తెచ్చాడు.

ఊరేగింపు ముగిసిన వెంటనే అనుకోకుండా గుర్రం చనిపోయింది. హఠాత్తుగా ఎలా చనిపోయిందో సీతయ్యకూ అర్థం కాలేదు. మర్నాడు సలీంఖాన్ దగ్గరికి వెళ్ళి జరిగిన దంతా చెప్పాడు. చనిపోయిన గుర్రం ఎలాగు రాదు. కాబట్టి దాని ఖరీదు ఎంతో చెబితే ఆ డబ్బును నీకు ఇచ్చేస్తాను అన్నాడు సీతయ్య.

అందుకు సలీం ఒప్పుకోలేదు. నాకు ఆ గుర్రమే కావాలి. డబ్బులొద్దు అంటూ పట్టు బట్టాడు. సీతయ్య ఎంత చెప్పినా సలీం వినలేదు. ఊళ్ళో వున్న పెద్దలకు ఈ విషయం చెప్పాలనుకున్నాడు. వెళ్ళి జరిగిందంతా గ్రామ పెద్దలకు సీతయ్య వివరంగా చెప్పాడు.

అప్పుడా ఊరిపెద్ద "బాధపడకు, నేను చెప్పినట్టు నడుచుకో" రేపు ఉదయం సలీం ఖాన్‌ని నా దగ్గరకు రమ్మని కబురు పంపిస్తాను. నిన్ను కూడా తీసుకు రమ్మని చెబుతాను. అతడు మీ యింటికి వచ్చేలోగా "నువ్వు వీధి తలుపును దగ్గరగా వేసి, లోపలివైపు ఖాళీకుండలు పేర్చి ఉంచు" అని గ్రామ పెద్ద సీతయ్యకు చెప్పాడు. అలాగే అంటూ సీతయ్య ఇంటికి వెళ్ళిపోయాడు.

మర్నాడు సలీంఖాన్ ఇంటికి కొంతమంది వెళ్ళి గ్రామ పెద్ద రమ్మంటున్నారని చెప్పారు. సీతయ్యను కూడా తనతో తీసుకురమ్మని చెప్పడంతో అతడింటికి వెళ్ళాడు, సలీం.

సీతయ్యా....అంటూ పిలుస్తూ గడియ తీసున్న తలుపును కాస్త లోపలికి తోశాడు. అంతే అవతలివైపున కుండలన్నీ బళ్ళున పగిలాయి. "ఎంతపని చేశావ్ ఖాన్" అంటూ సీతయ్య వాపోయాడు.

పొరపాటున ఇలా జరిగింది. బాధపడకు, కొత్త కుండలు కొనిస్తాలే" అన్నాడు, సలీం.

గుమ్మంలో కుండులు పెట్టమని గ్రామపెద్ద ఎందుకు చెప్పాడో సీతయ్యకు అర్థమైంది.

వెంటనే "లేదు నాకు ఈ కుండలే కావాలంటూ'' పట్టుబట్టాడు. ఇద్దరూ రామన్న దగ్గరికి వెళ్ళారు.

ఖాన్ ...... నువ్వేమో చనిపోయిన ఆ గుర్రమే కావాలంటున్నావు. సీతయ్యకు పగిలిపోయిన కుండలే కావాలట.

మీ యిద్దరూ వాటిని తెచ్చివ్వలేరు కాబట్టి "చెల్లుకు చెల్లు" ఇక వెళ్ళొచ్చు అన్నాడు గ్రామపెద్ద. తన మొండితనం తనకే నష్టం వచ్చిందని చింతిస్తూ ఇంటికెళ్ళాడు సలీం ఖాన్!

చూశారా బాలలూ! ఒక్కొసారి మన మొండితనం, మూర్ఖత్వం వల్ల మనమే నష్టపోతాము. బైబిలులో యిలా వుంది. ''మనము పాపము లేనివారమని చెప్పుకుంటే మనల్ను మనమే మోసం చేసుకుంటాము." మన జీవితాలలో దేవునికి నష్టం కలిగించే పనులు కాకుండా యిష్టంకలిగే బిడ్డలుగా జీవిద్దాం. ఏమంటారు? దైవాశీస్సులు!

యెడతెగక ప్రార్థన చేయుడి. *1 థెస్స 5:16*

# ప్రార్థన వేదిక

**1. చాగంటి కామేశ్వరావు- విజయనగరం**
ఉద్యోగంలోని సమస్యల కోసం

**2.జి. దయానందరావు-కొత్తగూడెం**
కుమార్తె వివాహం కోసం

**3. యం.సురేష్- అనపర్తి**
నూతన గృహ నిర్మాణం కోసం

**4.ఎ.కె.పాల్ -దర్వాడ**
పెట్టుబడులు తిరిగి వచ్చుట కోసం

**5.కప్పల ఫణిరాజు- రాజమండ్రి**
భార్యభర్తలిరువురి ఆరోగ్యముల కోసం

**6.పి. దేవదానము- గుంటూరు**
కుటుంబ ఆదరణ కోసం

**7.కె.యస్.యస్.రాణి- హైదరాబాద్**
కుమారుని ఉద్యోగం కోసం

**8.ఎ. జయశ్రీ అలెగ్జాండర్- ఆదిలాబాద్**
మా సంఘాభివృద్ధి కోసం

**9.శ్రీమతి జె.విమల- మదనపల్లె**
నా మోకాళ్ళ నొప్పుల స్వస్థత కోసం

**10. బి.మేరి- విశాఖపట్నం**
కుమార్తెల చదువుల కోసం

**11.డి.జె.కృపమ్మ- మహబూబ్‌నగర్**
నా భర్త ఆరోగ్యం కోసం

**12.వి.నవనీతమ్మ- నెల్లూరు**
పెద్దకుమారుని కుటుంబము కోసం

13.**యం.ఎ. సరోజనిదేవి-బళ్ళారి**
కుమార్తె వివాహం కోసం

**14.ఎలిజబెత్‌రాణి-వి.రెడ్డిపాలెం**
శంకర్ ఆరోగ్యం కోసం

**15.యం. లీలమ్మ- జమ్మలమడుగు**
మనవరాలి వివాహం కోసం

**16.కమలనెహ్రు- పీఠాపురం**
సుబ్రమణేశ్వరావుగారి హార్ట్‌సర్జరీ కోసం

**17.వి. అనిల్ మోహన్- సికింద్రాబాద్**
చెల్లెలి వివాహం కోసం

**18.కె. ఇందిర- ప్రొద్దుటూరు**
**కుమారుని చదువు(టెన్త్) కోసం**

**19.రమీజ్- పొదిలి**
కుటుంబ సమస్యల కోసం

***20.*బి. ప్రేమలీల- బాపట్ల**
కుమారుని ఆరోగ్యం కోసం

***21.*బి. విల్సన్ విజయ్‌కుమార్-హుబ్లీ**
నా ప్రమోషన్ కోసం

***22.*జ్యోతి- ఫిరంగిపురం మం॥**
కుమార్తె ఆరోగ్యం(బోన్ క్యాన్సర్) కోసం

**23. హెచ్. దినాకర్-తాండూరు**
**నా కుటుంబము కోసం**

**24.యం.డి. హేమలత-ఉంగటూరు మం॥**
నడుము, ఎడమకాలి నొప్పి స్వస్థత కోసం

**25. ఎ.వి.బాబురావు- హైదరాబాద్**
ప్రపూర్ణ వివాహము,ఉద్యోగం కోసం


**26. కొమ్మూరి ఇస్సాకు- దుగ్గిరాల మం॥**
నా ఉద్యోగం కోసం

**27. దుర్గరావు.కె. -రెంటచింతల**
మా కుటుంబము కోసం

**28. ఆర్. రామకృష్ణ- చక్రంపేట**
మా అమ్మగారి ఆరోగ్యం కోసం

**29.కె. లాజరస్- అద్దంకి**
నా ఆరోగ్యం (పక్షవాతం) కోసం

**30.యం. ప్రేమలీల- తిరుపతి**
ఆర్థిక సమస్యల కోసం



# తేరి చూడు

చూచేవారు లేక పట్టించుకొనేవారు లేక కొందరు నిరుపయోగంగా, నిస్సహాయంగా, నిరుత్సాహంగా, నిరీక్షణ కోల్పోయినవారుగా తమ జీవితాలను ఈడ్వలేక ఈడ్చుకుంటూ పోతున్నారు. అయినా ఎక్కడో మసక మసకగా ఒక చిన్న ఆశ తన జీవితంలో ఏదయినా ఒక అద్భుతం జరిగితే ఎంత బాగుంటుందని. కాలం గడుస్తుంది ఆచిన్న ఆశకూడా అణగారిపోతుంది. కాని ఆశగలిగిన ప్రాణాలను మేలుతో తృప్తి పర్చడానికి ఆపద్భాందవుడు, ఆశ్చర్యకరుడును, ఆదిసంభూతుడైన వాని కన్నులు అందరిని చూస్తున్నాయి. ఆయన అందరిపట్ల శ్రద్ధ వహిస్తున్నాడు. నిరీక్షణకోల్పోయిన వారిని సహితం యేసు తనకు సాక్షులుగా నిలబెట్టుకోవాలన్నదే ఆయన ఆశ.

నిరీక్షణ కోల్పోయిన బ్రతుకు బండిని యాచనతో యీడ్చుకువెళ్తున్న ఓఅభాగ్యుని దీనగాధ అ.కా 3:1-10 లో లిఖించబడియున్నది. పుట్టుకుంటువాడైన ఒక మనుష్యుని గూర్చిన వేధనభరితమైన వృత్తాంతమది. తనతోపాటుగా జన్మించిన వారందరూ సంతోషంగా జీవిస్తూ, సమాజమందిరాలకు వెళ్లి ధర్మశాస్త్రమును పఠిస్తూ ఉండగా తాను మాత్రం ఎక్కడికి వెళ్ళలేక మరొకరిపై ఆధారపడుతూ, తాను మరొకరికి తన భిక్షాటన ద్వారా ఆధారమౌతూ ఏవిధమైన నిరీక్షణలేని జీవితాన్ని గడుపుతున్నాడు. అతనికెవ్వరూ ఆదరణను యివ్వలేకపోయారు. "తనను కుంటివానిగా పుట్టించిన దేవునిపై ఆయాసం ఉన్నా ఆ దేవుని ఆలయమెట్లనే ఆసరగా చేసుకొని అడుక్కొంటున్న అభాగ్యుడితడు".

సమాజంలో కొంతమంది గ్రుడ్డివారుగాను, మరికొందరు వివిధ రకాల రోగగ్రస్తులుగాను ఉండాలన్నది దేవుని చిత్తమా? కానేకాదు. అయితే ఎందుకీ పరిస్థితి. ఒకనాడు యేసు శిష్యులు ఒక గ్రుడ్డివానిని చూచి.... "బోధకుడా! వీడు గ్రుడ్డివాడై పుట్టుటకు ఎవడు పాపము చేసెను? వీడా వీని కన్నవారా?" అని ఆయనను అడుగగా అందుకు యేసు "వీడైనను వీనికన్నవారైనను పాపం చేయలేదు కాని దేవుని క్రియలు వీనియందు ప్రత్యక్షపరచబడుటకై వీడు గ్రుడ్డివాడుగా పుట్టెను" అని అన్నారు (యోహాను 9:3). నిజమే మానవాళి అంతా దేవుని క్రియలను చూచి, అనుభవించి దేవుని మహిమ పరచుటకే కదా ఉన్నది. దేవునిని మహిమపరచవలసిన ప్రజలు వక్రమార్గాలలో పయనించడం వలన ప్రకృతి భీభత్సాలకు, అనారోగ్యాలకు, అంగవైకల్యాలకు గురౌతున్నారు (యిర్మీయా 5:25).

సొలోమోను కట్టించిన అత్యంత సౌంధర్యవంతమైన దేవాలయాన్ని చూడడానికి వెళ్ళే

సందర్శకులు కొందరైతే, ఆ దేవాలయములో దేవుని ఆరాధించడానికి వెళ్ళేవారు కొందరు. కాని ఇతను మాత్రం అక్కడికి వచ్చే వారి యొద్ద భిక్షమెత్తుటకు ప్రతిదినము కొందరి సహాయంతో వెళ్లుచున్నాడు. ఆరోజుకూడా అలానే వెళ్లాడు కాని ఆరోజు అతనికొక ప్రత్యేకమైన రోజని అతనికి తెలియదు. అపొ॥ పేతురు, యోహానులు దేవాలయానికి ప్రార్థనకై వెళ్తుండగా ఇతడు వారిని భిక్షమడిగాడు. వారు ఇతని తట్టు 'తేరిచూచిరి'. అతడు కుంటివాడని పేతురు, యోహానులు గ్రహించి మాతట్టు చూడమన్నారు. వారి దగ్గర ఏమైన దొరుకుతుందేమోనని వారితట్టు చూశాడు. తను ఏదో పొందబోవుచున్నాడన్న ఆశతో వారియందు లక్ష్యముంచాడు, తన కనుదృష్టి వారిపై కేంద్రీకరించాడు. పేతురు, యోహానులు తేరిచూస్తున్నట్లే ఇతను కూడా వారిని చూడటం ప్రారంభించాడు. వారు భిక్షం వేసేవారైతే వేసి వెళ్తారుకాని వీరు భిక్షం వేసే వారుకాదని భిక్షానికి మించినది వీరి యొద్ద ఉన్నదని ఇతని కర్థమైంది. గనుకనే వారిపై దృష్టిని ఏకాగ్రతతో నిలిపాడు. అపుడు పేతురు – "వెండి బంగారములు నాయొద్ద లేవు గాని నాకు కలిగినదే నీకిచ్చు చున్నాను. నజరేయుడైన యేసుక్రీస్తు నామమున నడువుమని చెప్పి వాని పట్టుకొని లేవనెత్తెను" (3:6-8). వెంటనే వాని పాదాలు బలము పొందుకొని దిగ్గున లేచి నడుస్తూ గంతులు వేయుచూ దేవుని మహిమ పరుస్తూ దేవాలయములోనికి వెళ్ళాడు.

ప్రియ స్పందన పాఠకులారా! విశ్వమంతటిని దేవాది దేవుని నేత్రాలు చూస్తున్నాయి. నిన్నూ చూస్తున్నాయి. ఆ భిక్షగాని వలె ఎవరో ఒకరి మీద ఆధారపడి, ఎక్కడో ఒకచోట చతికిలబడి ఆశలు అట్టుడిగిన స్థితిలో నీవుంటే ప్రభువు నిన్ను తేరి చూస్తున్నారని గ్రహించు. ప్రభువు నిన్ను కూడా స్వస్థపరచి ఒక ప్రయోజన కరమైన వ్యక్తిగా, తనకు సాక్షిగా నిలపాలని ఆకాంక్షిస్తున్నారు. నేడూ అనేకమంది దేవునికొరకు నడువలేని ఆత్మీయ అవిటితనంలో వుండి మందకొడిగా జీవితాలను సాగిస్తున్నారు, అట్టివారిని ప్రభువు తేరిచూస్తూ వారికాళ్లను లేడికాళ్లవలె మార్చి పర్వతములపైన తన వాక్కును ప్రకటించేవారుగా నిలబెట్టాలనుకుంటున్నాడు.


నీవు ఏపరిస్థితిలో ఉన్నా యేసువైపు చూడు ఆయన యందు లక్ష్యముంచి ఆయన తట్టు తేరిచూడు నీజీవితమును ఆనందమయముగా ప్రభువు మారుస్తాడని నమ్ము. చనిపోయిన వారిని సహితం యేసు సజీవులనుగా లేపారు. ఆయన చేసిన కార్యాలు అనంతం (యోహాను 21:25). యేసును నమ్మి, ఆయనకు నిన్ను నీవు అప్పగించుకుంటే నీవు ఒకరిపై ఆధారపడకుండా నీకు నీవుగా జీవించగలవు. నీ సమస్య, నీ అపజయం, అవమానం, దు:ఖం నిన్ను విడిచిపోతాయి. విజయాన్ని నీవు సొంతం చేసుకుంటావు.

***నిన్ను నీవు చూసుకొని ఎంతకాలం బాధపడతావు – యేసువైపు చూడు (కీర్తన 107:35), ఆయన నిన్ను ఉద్ధరిస్తాడు.***

శాంతి... నా శాంతినే మీకనుగ్రహించు చున్నాను. యోహాను 14:27

అందరికీ ప్రేమతో ఆహ్వానం

# శాంతి, సువార్త మహాసభలు



వాక్యోపదేశకులు



**ఆచార్య ఆరార్కే మూర్తి** గారు
(ప్రఖ్యాత రేడియో ప్రసంగీకులు, విశ్వవాణి రేడియో)

**డా॥ దేవసహాయం దండల** గారు
(సుప్రసిద్ధ సువార్తికులు, స్పందన పత్రిక సంపాదకులు)

కార్యక్రమ వివరాలు

| | | | |
|---|---|---|---|
| నవంబరు | 30 శుక్ర | - సా. 4.30 గం.లకు | - దుబాయ్ ఇవాంజెలికల్ చర్చ్, జెబెల్ అలి |
| డిసెంబరు | 1 శని | - రా. 8 గం.లకు | - వర్షిప్ సెంటర్, షార్జా |
| డిసెంబరు | 2 ఆది | - మ. 2.30 గం.లకు | - యు. టి. జి. సి వార్షికోత్సవము, అబుదాబి |
| డిసెంబరు | 4 మంగ | - రా. 8 గం.లకు | - హోలి ట్రినిటి చర్చి సెంటర్, దుబాయ్ |
| డిసెంబరు | 5 బుధ | - రా. 8 గం.లకు | - ఇవాంజెలికల్ చర్చి సెంటర్, అబుధాబి |

## సంఘనాయకుల ప్రత్యేక సమావేశము - ప్రేమవిందు

డిసెంబరు 3 సోమ - రా. 7.30 గం. - దుబాయ్ ఇవాంజెలికల్ చర్చి, జెబెల్ అలి - సేవలో ఉత్తేజాన్ని, సాక్ష్యాలతో కూడిన వాక్య సందేశాన్ని రెవ. ఆచార్య మూర్తి గారు అందిస్తారు. - పాల్గొనదలచినవారు నవంబరు 20 వ తే. లోపు మీ పేర్లను మీ పాస్టరు గారికి ఇవ్వవలెను. - ప్రవేశ రుసుము 25 దిర్హామ్స్ మాత్రమే - మరిన్ని వివరములకు 04-8846621 - బైబిల్ స్టడీకి సంబంధించిన అనేక గ్రంథాలు తగ్గింపు ధరలకు దొరకును - ఈ కార్యక్రమాలన్నిటి కోసం విశ్వాసముతో ప్రార్థనలు చేయుడి.

నిర్వహణ - బైబిలు సొసైటి, గల్ఫ్, ఫోన్ 04-8846621
మరియు యు.ఎ.ఇ తెలుగు సంఘముల సహకారముతో....


(FOR PRIVATE CIRCULATION & CHURCH USE ONLY)

Regd.No.VJ/057/2006-2008 RNI No.321106/76

LICENCED TO POST WITHOUT PRE - PAYMENT
PMG/VJ/PWPP/9/2006-2008 dtd 8-3-2006 at Vijayawada-10

శ్రీమతి గ్రేస్ విజయ గారి మరో అద్భుత రచన

# పవిత్ర యెరూషలేము సందర్శన




ఈ మధ్యనే యెరూషలేమును దర్శించిన శ్రీ సుందరరావు గారు, శ్రీమతి గ్రేస్ విజయ గార్లు తమ ఆధ్యాత్మిక అనుభవాలను ఈ గ్రంథంలో వివరించటం మాత్రమే కాకుండాయెరూషలేమును దర్శించలేని అనేకమందిని దృష్టిలో ఉంచుకుని తాము చూసిన యెరూషలేమును కళ్ళకు కట్టినట్టు వర్ణించి మీ ఆత్మీయ క్షేమంకోసం అందిస్తున్న ఈ గ్రంథాన్ని మీలో ప్రతి ఒక్కరూ తప్పక చదవాలి.మీ స్నేహితులు బంధువుల చేత చదివించాలి.మనం బైబిలులో చదువుతున్న యెరూషలేములోని అందమైన చిత్రాలు, మల్టీకలర్‌లో చూడముచ్చటగా ముద్రించబడి, పాఠకులకు నిజంగా యెరూషలేమునే సందర్శిస్తున్నామా అనే అనుభూతిని కలిగిస్తుందీ గ్రంథం. సుమారు 230 పేజీలతో 1/8 క్రౌను సైజులో ఉండే ఈ గ్రంథం మీద వ్యాపారం చేసి లాభాలు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గాక, మీ ఆధ్యాత్మిక ఆశీర్వాదాల కోసం శ్రీమతి గ్రేస్ విజయ గారి కుటుంబ సభ్యుల సహకారంతో, ప్రింటింగ్ ఖర్చుల ధరకే మీకు అందించబడుతుంది.
కేవలం రు. 50 (మాత్రమే) రిజిష్టరుపోస్టులో రావాలంటే మరో రు. 12 అదనంగా పంపాలి.

**స్పందన** పుస్తకాగారం, విజయవాడ - 2